




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 356 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 29 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :356 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 29 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## ఏపీలో రూ. 53 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే

# ప్రాజెక్టులకు ఆమోదం..

- ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ
- వేగంగా పారిశ్రామిక ప్రాజెక్టులు పూర్తవ్వాలన్న ముఖ్యమంత్రి
- ఏరో స్పేస్, ఐటీ, ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈ రంగాల్లో పెట్టుబడులు
- రూ.53,922 కోట్ల మేర పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ఈ ప్రాజెక్టులతో 83,437 మందికి ఉద్యోగ అవకాశాలు
- నవంబర్ 15లోగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు
- బిజినెస్ సెంటర్ల తరహాలో పారిశ్రామిక పార్కులతో ఎకో సిస్టం
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు వేగంగా పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో త్వరగా అనుమతులు ఇస్తున్నామని, అదే తరహాలో ప్రాజెక్టుల గ్రౌండింగ్ కూడా అంతే వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. రూ. 53,922 కోట్ల మేర పెట్టుబడులు పెట్టే 30 ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 83,437 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఇక నుంచి ప్రతీ నెలా

వివరాలు 2లో..

### నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా

# బూతులు తిడుతున్నారు

## బీఆర్ నాయుడుపై భూమన ఫైర్

- టీటీడీ భూములపై భూమన తీవ్ర విమర్శలు
- విలువైన భూములను టూరిజం శాఖకు ఎందుకిస్తున్నారని సూటి ప్రశ్న
- తనపై చేస్తున్న ఆరోపణలపై సీబీఐ విచారణకైనా సిద్ధమని ప్రకటించిన భూమన
- క్విడ్‌ప్రో కింద నాయుడుకి టీటీడీ పదవి వచ్చిందంటూ వ్యాఖ్య
- టీటీడీ ఛైర్మన్ పదవి శాశ్వతం కాదన్న భూమన



**పెన్ పవర్ డెస్క్:**టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అత్యంత విలువైన టీటీడీ భూములను టూరిజం శాఖకు ఎందుకు కేటాయిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈరోజు తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనపై చేస్తున్న ఆరోపణలపై సీబీఐ విచారణకైనా సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. టీటీడీకి చెందిన విలువైన భూములను టూరిజం శాఖకు బదలాయించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని తాను అడిగిన ప్రశ్నలకు బీఆర్ నాయుడు ఇప్పటికీ బదులివ్వలేదని భూమన ఆరోపించారు. పైగా, సమాధానం చెప్పకుండా తనను వ్యక్తిగతంగా దూషిస్తున్నారని మండిపడ్డారు. "ప్రశ్నించినందుకు బూతులు తిడుతున్నారు. ఆయన వ్యాఖ్యలు చాలా దారుణంగా ఉంటున్నాయి. అలాంటి వ్యక్తి టీటీడీ ఛైర్మన్‌గా ఉండటం హిందువుల దురదృష్టం" అని భూమన వ్యాఖ్యానించారు. బీఆర్ నాయుడును తప్పుడు ప్రచారాలకు బ్రాండ్

వివరాలు 2లో..

# తక్షణమే అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయండి



- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఏపీలో విస్తారంగా వర్షాలు
- పరిస్థితిపై హోంమంత్రి అనిత సమీక్ష
- సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలని సూచన

**పెన్ పవర్ డెస్క్:**బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సహాయక చర్యలపై దృష్టి సారించిన మంత్రులు..

వివరాలు 2లో..

# చైనా పర్యటనకు ప్రధాని మోదీ.. జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం



- ఏడేళ్ల తర్వాత తొలిసారిగా చైనాకు ప్రధాని నరేంద్ర మోదీ
- గల్వాన్ లోయ ఘర్షణల అనంతరం ఇదే మొదటి పర్యటన
- ఎస్సీఓ సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రత్యేక భేటీ
- ఆదివారం టియాంజిన్‌లో ఇరు దేశాధినేతల ద్వైపాక్షిక చర్చలు
- సరిహద్దు పెట్రోలింగ్‌పై ఒప్పందం తర్వాత మెరుగుపడుతున్న సంబంధాలు

**పెన్ పవర్ డెస్క్:**భారత్, చైనా సంబంధాలలో ఒక కీలక పరిణామం చోటుచేసు కోనుంది. సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో 2020లో జరిగిన ఘర్షణల అనంతరం, ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

వివరాలు 2లో..

# మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు



- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'
- బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్లు తొలగించారని రాహుల్ ఆరోపణ
- రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని వ్యాఖ్య
- బాధితుల్లో ఎక్కువగా బడుగు బలహీన వర్గాలవారేనని ఆరోపణ
- ఓట్ల దొంగతనంపై మరిన్ని ఆధారాలు బయటపెడతానన్న రాహుల్

**పెన్ పవర్ డెస్క్:**ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, 'ఓట్ చోర్– గద్దీ ఛోడ్' అనే నినాదంతో ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా ఈరోజు సీతామఢీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి

వివరాలు 2లో..

### ప్రతి ఇంటికి ఫ్యామిలీ కార్డు...

## ఉల్లి రైతులకు నష్టం

# వాటిల్లకూడదు

- ఆధార్ తరహాలో కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం నిర్ణయం
- ప్రభుత్వ పథకాల వివరాలన్నీ ఇకపై ఒకే కార్డులో నమోదు
- రైతు బజార్ల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాల పంపిణీని మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఆధార్ కార్డు తరహాలో ఒక ప్రత్యేక 'ఫ్యామిలీ కార్డు'ను జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో 'ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్' వ్యవస్థపై

వివరాలు 2లో..

# ఏపీలోని అంతర్జాతీయ క్రీడాకారులకు గుడ్ న్యూస్

- రూ.4.9 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి
- గత ప్రభుత్వ బకాయిలు కూడా చెల్లించిన కూటమి సర్కార్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్జాతీయ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత ప్రభుత్వ హయాం నుంచి పెండి ంగ్‌లో ఉన్న క్రీడా ప్రోత్సాహ కాలను విడుదల చేసింది.

వివరాలు 2లో..




# జైల్లో మిథున్ రెడ్డిని చిత్రహింసలకు గురి చేస్తున్నారు

- రాజమండ్రి జైల్లో మిథున్‌రెడ్డితో వైసీపీ నేతల భేటీ
- పెద్దిరెడ్డి కుటుంబ ప్రతిష్టను దెబ్బతీయడానికే అరెస్ట్ అని ఆరోపణ
- ఎమర్జెన్సీని మించి ప్రతిపక్షాలను వేధిస్తున్నారంటూ ప్రభుత్వంపై విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**లిక్కర్ స్కాం ఆరోపణలతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ లో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఆ పార్టీ నేతలు ములాఖత్ లో కలిశారు. మాజీ మంత్రి శంకరనా

వివరాలు 2లో..



# మోదీ ఎందుకు ఇలా చేస్తున్నారో.. అమెరికా ఆర్థికవేత్త ఆశ్చర్యం

- ట్రంప్ టారిఫ్ లు తగ్గించుకునే అవకాశం భారత్ చేతుల్లోనే ఉందన్న పీటర్ నవారో
- రష్యా నుంచి చమురు కొనడం ఆపేసిన మరునాడే అదనపు సుంకాలు రద్దు
- ఉక్రెయిన్ పై రష్యా దూకుడుకు పరోక్షంగా మోదీ ప్రోత్సహిస్తున్నారంటూ ఆక్షేపణ



**పెన్ పవర్ డెస్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలను తగ్గించుకునే అవకాశం భారత్ కు ఇప్పటికీ ఉందని వైట్ హౌస్ సలహాదారు, ఆర్థిక వేత్త పీటర్ నవారో పేర్కొన్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపేసిన మరుసటి రోజే అదనపు సుంకాలు రద్దు చేస్తామని చెప్పారు.

వివరాలు 2లో..

# ఎన్నికల వేళ బీహార్ లోకి చొరబడిన ఉగ్రవాదులు... హైఅలర్ట్

- రాష్ట్రంలోకి ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదుల చొరబాటు
- నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్
- ఉగ్రవాదుల ఫొటోలను విడుదల చేసిన పోలీసులు
- జైషే మహ్మద్ ఉగ్రవాదుల కోసం వేట

**పెన్ పవర్ డెస్క్:**అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీహార్‌లో ఉగ్రవాదుల కదలికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ (జెఇఎం) ఉగ్రవాద సంస్థకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు నిఘా

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

### చంద్రబాబులో అప్పటికీ - ఇప్పటికి ఎంత తేడా? గమనించారా?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనలో చాలా మార్పు కనిపిస్తుంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకెళ్లడంలో దృష్టి పెట్టడం పక్కన పెడితే మిగిలిన విషయాల్లో ఆయన ఖచ్చితంగా వ్యవహరిస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు మూడు దఫాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా తీసుకోని రాజకీయ పరమైన నిర్ణయాలు ఈ సారి మాత్రం తీసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో ఎమ్మెల్యేలు కానీ, మంత్రులు కానీ ఏమైనా తప్పులు చేస్తే వెంటనే చర్యలకు దిగేవారు కాదు. దానిపై సాగదీసేవారు. నాడు సోషల్ మీడియా ప్రభావం కూడా తక్కువగా ఉండటంతో అటువంటి ఘటనలపై నిజనిర్ధారణ కమిటీలను వేసేవారు. పార్టీ వారినే పంపి అందులో నిజాలను తెలుసుకునే ప్రయత్నం చేసేవారు.

**కాలయాపన చేస్తూ...**

అయితే అంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాస రెడ్డిని మంత్రి పదవి నుంచి తప్పించారు. అంతే తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలపై తీసుకున్న చర్యలు చాలా తక్కువనే చెప్పాలి. ఎక్కువగా పార్టీ క్రమశిక్షణ కమిటీ, నిజనిర్ధారణ కమిటీలను నియమించి కాలయాపన చేస్తూ ఆ ఘటన మర్చిపోయిన తర్వాత షరా మామూలయ్యేది. కానీ ఇప్పుడు అలా కాదు. వెను వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల విషయం తెలిసిన వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత తాజాగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయించారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఉండేవి కావని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.

**గతంలో ప్రజా సమస్యలపై...**

ఇక గతంలో ప్రజా సమస్యలపై ఎవరైనా ఆందోళనలు చేసినా వెంటనే స్పందించే వారు కాదు. అలాగే విపక్ష నేతలు వెళ్లి అక్కడ పర్యటనలు చేసినా పట్టించుకునే వారు కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్తు ఛార్జీల పెంపుదలపై ఆయన కఠినంగా వ్యవహరించారు నాడు. కానీ నేడు అలా కాదు. ఏ మాత్రం నిరసనలు, ఆందోళనలు కనిపించినా వెంటనే చంద్రబాబు రియాక్ట్ అవుతున్నారు. మిరప, పొగాకు, చిత్తూరు మామిడి రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో విపక్ష నేత అక్కడ పర్యటనలకు చేయకముందే ఆ సమస్యపై స్పందించారు. తాజాగా దివ్యాంగులను నెలకు పదిహేను వేల రూపాయల పింఛన్లు తొలగించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆందోళనకు దిగితే వెంటనే స్పందించి అర్హులైన అందరికీ ఇస్తామని ఆయనే చెప్పారు. ఇక స్మార్ట్ మీటర్ల విషయంలోనూ ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు కమర్షియల్ భవనాలకే పరిమితం చేయడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. చంద్రబాబులో వచ్చిన ఈ మార్పు చూసిన పార్టీ సీనియర్ నేతలు మాత్రం ఆశ్చర్యపోతున్నారు.

## జైల్లో మిథున్ రెడ్డిని చిత్రహింసలకు గురి చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

రాయణ, మాజీ ఎంపీలు గోరంట్ల మాధవ్, మార్గాని భరత్ తదితరులు మిథున్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ములాఖత్ అనంతరం జైలు వద్ద మీడియాతో మాట్లాడుతూ వీరు కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అనంతరం కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని వారు ఆరోపించారు. గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జైలు, బెయిల్‌తోనే కాలం గడుపుతోందని ఎద్దేవా చేశారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని మించి చంద్రబాబు ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. "గతంలో ఇదే జైలు వద్దకు వచ్చిన పవన్ కల్యాణ్ మాటలు కోటలు దాటాయి. ఇప్పుడు ఆయన కనీసం గడప దాటి మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. జైల్లో మిథున్‌రెడ్డిని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. పాకిస్థాన్ సరిహద్దులో ఉన్నట్టుగా జైలు వద్ద భారీ గేట్లు ఏర్పాటు చేశారు" అని విమర్శించారు.

శంకరనారాయణ మాట్లాడుతూ... లిక్కర్ స్కాం పేరుతో ప్రభుత్వం ఒక కట్టుకథ అల్లిందని మండిపడ్డారు. కేవలం పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకునే ఈ అక్రమ కేసు బనాయించారని అన్నారు. జగన్ ప్రతిష్టను కించపరిచేందుకు చంద్రబాబు పన్నుతున్న కుట్రలను ధైర్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. మార్గాని భరత్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఆరోపిస్తున్న రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌లో 90 రోజులు గడిచినా మనీ ట్రైల్‌ను ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. మద్యం డిస్టిలరీలు ఎవరికి ముడుపులు చెల్లించాయో ప్రజలకు వెల్లడించలేకపోతున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, రాబోయేది జగన్ ప్రభుత్వమేనని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన వారు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారని ఆయన హెచ్చరించారు.

## చైనా పర్యటనకు ప్రధాని మోదీ.. జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం

- మొదటి పేజీ తరువాయి

తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. చైనాలోని టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఆయన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. ఈ కీలక భేటీ ఆదివారం జరగనుంది. జపాన్ లో తన రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ నేరుగా చైనాకు వెళ్లనున్నారు. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు మోదీ ఈ సదస్సుకు హాజరవుతున్నారు. గత నాలుగేళ్లుగా వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించుతూ, పెట్రోలింగ్ నిర్వహించడంపై ఇరు దేశాలు ఇటీవలే ఒక ఒప్పందానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సానుకూల వాతావరణంలో ఈ పర్యటన జరగనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. గతేడాది రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో కూడా ఇరువురు నేతలు సమావేశమయ్యారు.

ఈ నెల 19న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయి, ఎస్సీఓ సదస్సుకు రావాల్సిందిగా జిన్‌పింగ్ పంపిన ఆహ్వాన పత్రాన్ని స్వయంగా అందజేశారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని మోదీ స్పందిస్తూ, "గతేడాది కజాన్‌లో అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తో భేటీ అయినప్పటి నుంచి ఇరు దేశాల ప్రయోజనాలకు, సున్నితత్వాలకు పరస్పరం గౌరవం ఇచ్చుకుంటూ సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయి. టియాంజిన్‌లో జరగబోయే సమావేశం కోసం ఎదురుచూస్తున్నాను" అని 'ఎక్స్' (ట్విట్టర్) లో పోస్ట్ చేశారు. ప్రధాని మోదీ పర్యటన ఇరు దేశాల సంబంధాల మెరుగుదలకు, అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని భారత్‌లో చైనా రాయబారి జు ఫెయిహాంగ్ ఈ నెల 21న ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి ఇరు దేశాల బృందాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతను కాపాడటం అత్యంత ముఖ్యమని, సరిహద్దు సమస్యకు న్యాయబద్ధమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు పీఎంఓ ఒక ప్రకటనలో పేర్కొంది.

## మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారు

- మొదటి పేజీ తరువాయి

సుమారు 65 లక్షల మంది పేర్లను అక్రమంగా తొలగించారని, ఇది ఓట్ల దొంగతనం కిందకే వస్తుందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఓట్లను దొంగిలిస్తున్నాయి. గతంలో మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలోనూ ఇదే విధంగా చేశారు. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది. కానీ, బిహార్ ప్రజలు తమ ఓట్లను దొంగిలించడానికి అంగీకరించరు" అని హెచ్చరించారు. తొలగించిన ఓట్లలో ఎక్కువ శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందినవేనని ఆయన ఆరోపించారు. ఓట్ల చోరీకి సంబంధించి రాబోయే రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని రాహుల్ స్పష్టం చేశారు. కొంతమంది పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే బీజేపీ ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని ఆయన విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా దొంగిలించిన ఓట్లతోనే ఏర్పడిందని, ప్రధాని సైతం ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని సంచలన ఆరోపణలు చేశారు. యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ స్థానిక సీతాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17న ప్రారంభమైన 'ఓటర్ అధికార్ యాత్ర' 16 రోజుల పాటు 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభతో ఈ యాత్ర ముగియనుంది.

# ఏపీలో రూ. 53 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే ప్రాజెక్టులకు ఆమోదం..

- మొదటి పేజీ తరువాయి

సమీక్షిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టుల్లో స్థితిగతులపై క్షేత్రస్థాయిలో మంత్రులు కూడా పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టుల వివరాలను, ఉత్పత్తి ప్రారంభించేందుకు ఎంత సమయం పట్టిందన్న అంశాలను విశ్లేషించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏ ప్రాజెక్టు అయినా ఆలస్యం అవుతుంటే సంబంధిత సంస్థల ప్రతినిధులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని, అధికారులు కూడా అదే వేగంతో పనిచేయాలని సూచించారు. మహీంద్రా ఈవీ వాహనాల ఉత్పత్తి ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేసేలా తానే స్వయంగా సంప్రదిస్తున్నానని, దీనికి అనుగుణంగా అధికారులూ కూడా స్పందించాలని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలదే ప్రధాన భూమిక**

వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలే కీలకమని, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇవి ప్రధాన భూమిక పోషిస్తాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు పుష్కలంగా అవకాశాలున్నాయని అన్నారు.

పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు అధికారులు ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చిత్తూరు, అన్నమయ్య తదితర జిల్లాల్లో స్థానికంగా ఉన్న మ్యాంగో ప్రాసెసింగ్ పరిశ్రమల వల్లే రైతులకు ఎక్కువ ఇబ్బంది లేకుండా చూడగలిగామని అన్నారు. పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటకలలో ఈ తరహా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు లేవన్నారు.

**బిజినెస్ సెంటర్ల తరహాలో ఎంఎస్ఎంఈ పార్కులతో ఎకో సిస్టం**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన ప్రాంతాల్లో మినహా మిగతా నియోజకవర్గాల్లో 3 నెలల్లో ఈ పార్కులు అందుబాటులోకి రావాలన్నారు. ఈ పారిశ్రామిక పార్కులన్నీ బిజినెస్ సెంటర్లలా చేసి ఒక ఎకో సిస్టంను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులు, భూ యజమానుల్ని కూడా ఈ పారిశ్రామిక పార్కుల్లో భాగస్వాములను చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా వారికి ఆదాయం వచ్చేలా చేయాలని అన్నారు. అలాగే రాష్ట్రంలో మెగా, మీడియం స్థాయిలో పారిశ్రామిక పార్కులను నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పారిశ్రామిక పార్కులకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లను అనుసంధానించటంతో పాటు వాటికి ప్రామాణిక మార్గదర్శకాలను నిర్దేశించాలన్నారు.

పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆర్టీఐహెచ్ ద్వారా జరిగే కార్యకలాపాలను సమీక్షించాలని సీఎం సూచించారు. మరోవైపు రాష్ట్రంలోని ఆటోనగర్ లలో రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలకు తదుపరి అనుమతులు రాకపోవటంపై సమీక్షించిన సీఎం దీనికి తగిన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఏపీకి పరిశ్రమలు రావటం ముఖ్యమన్న సీఎం.. ఇంధన ఉత్పత్తి, ఐటీ, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్ ఆధారిత వాల్యూ చైన్ పరిశ్రమల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. అలాగే ఐటీ రంగంలో వర్క్ ఫ్రమ్ హోమ్, కో-వర్కింగ్ స్పేస్ లను ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు గత పాలకులు తిరుపతి వేంకటేశ్వరస్వామి ఏడుకొండల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించారని, కొండను ఆనుకుని హోటల్ నిర్మాణానికి స్థలం కేటాయించిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయంగా స్థలం చూపామని అన్నారు. దీనిపై కొందరు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె.విజయానంద్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**10వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన ప్రాజెక్టులు**

1. మదర్ డెయిరీ లిమిటెడ్ రూ.427 కోట్లు పెట్టుబడులు, 180 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
2. ఏసీఈ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.786 కోట్ల పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
3. అపోలో టైర్స్ రూ.1110 కోట్ల పెట్టుబుడులు, 500 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా.
4. స్కై రూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.400 కోట్ల పెట్టుబడులు, 300 మందికి ఉద్యోగాలు, తిరుపతి.
5. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1197 కోట్ల పెట్టుబడులు, 870 మందికి ఉద్యోగాలు, మడకశిర.
6. వరాహా ఆక్వా ఫార్మ్స్ రూ.32 కోట్ల పెట్టుబడులు, 3,500 మందికి ఉద్యోగాలు, అనకాపల్లి.
7. జె.కుమార్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.237 కోట్ల పెట్టుబడులు, 5000 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం.
8. అలీప్ సంస్థ, రూ.45 కోట్ల పెట్టుబడులు, 2,500 మందికి ఉద్యోగాలు, చిత్తూరు.
9. ఇఫ్కో కిసాన్ సెజ్ రూ.870 కోట్ల పెట్టుబడులు, 25,000 మందికి ఉద్యోగాలు, నెల్లూరు.
10. ధీరూభాయ్ అంబానీ గ్రీన్ టెక్ పార్క్ రూ.1843 కోట్ల పెట్టుబడులు, 19,000 ఉద్యోగాలు, కృష్ణపట్నం.
11. ఎన్.కామ్ వైజాగ్ హోటల్ రూ.178 కోట్ల పెట్టుబడులు, 250 మందికి ఉద్యోగాలు, భోగాపురం.
12. మంజీరా హాస్పిటాలిటీ, రూ.276 కోట్ల పెట్టుబడులు, 225 మందికి ఉద్యోగాలు, అమరావతి.
13. శ్రీ వెంకటేశ్వర లాడ్జి రూ.96 కోట్ల పెట్టుబడులు, 300 మందికి ఉద్యోగాలు, మంత్రాలయం.
14. సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) రూ.1500 కోట్ల పెట్టుబడులు, 950 మందికి ఉద్యోగాలు, కొలిమిగుండ్ల, నంద్యాల జిల్లా.
15. సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా రూ.800 కోట్లు, 200 మందికి ఉద్యోగాలు, రామగిరి, ముత్తవకుంట్ల, సత్యసాయి జిల్లా.
16. సెరెంటికా రెన్యూవబుల్స్ ఆఫ్ ఇండియా రూ.2000 కోట్లు పెట్టుబడులు, 320 మందికి ఉద్యోగాలు, అనంతపురం.
17. సెరెంటికా రెన్యూవబుల్స్ ఆఫ్ ఇండియా రూ.2,400 కోట్ల పెట్టుబడులు, 380 మందికి ఉద్యోగాలు, కర్నూలు.
18. హెక్సా ఎనర్జీ బీహెచ్ ఫైవ్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.1,200 కోట్ల పెట్టుబడులు, 400 మందికి ఉద్యోగాలు, కడప.
19. రెఫెక్స్ సోలార్ ఎస్పీవీ ఫైవ్ లిమిటెడ్, రూ.480 కోట్ల పెట్టుబడులు, 345 మందికి ఉద్యోగాలు, శ్రీ సత్యసాయి జిల్లా.
20. బ్రైట్ ఫ్యూచర్ పవర్ లిమిటెడ్, రూ.3,286 కోట్ల పెట్టుబడులు, 440 మందికి ఉద్యోగాలు, అనంతపురం.
21. నవయుగ ఇంజనీరింగ్ లిమిటెడ్, రూ.15,455 కోట్ల పెట్టుబడులు, 8,400 మందికి ఉద్యోగాలు, పాడేరు.
22. చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, రూ.15,050 కోట్ల పెట్టుబడులు, 8,400 మందికి ఉద్యోగాలు, కడప.
23. సిర్మా ఎస్జీఎస్ టెక్నాలజీ రూ.1595 కోట్ల పెట్టుబడులు, 2,170 మందికి ఉద్యోగాలు, నాయుడుపేట.
24. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.586 కోట్ల పెట్టుబడులు, 613 మందికి ఉద్యోగాలు, కుప్పం.
25. బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్, రూ.485 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు, అనకాపల్లి.
26. అదాని విల్మర్ లిమిటెడ్, రూ.578 కోట్లు, 285 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లా.
27. టైరోమెర్ టెక్నాలజీ లిమిటెడ్, రూ.85 కోట్లు పెట్టుబడులు, 120 మందికి ఉద్యోగాలు, చిత్తూరు.
28. ర్యామ్ శీ బయో ప్రైవేట్ లిమిటెడ్, రూ. 356 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు, కడప జిల్లా.
29. శ్రీ సర్వారాయా షుగర్స్ లిమిటెడ్, రూ.161 కోట్ల పెట్టుబడులు, 189 మందికి ఉద్యోగాలు, కోనసీమ.
30. పట్టాభి ఆగ్రోఫుడ్స్, రూ.408 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు, కాకినాడ.

## తక్షణమే అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయండి

- మొదటి పేజీ తరువాయి

. అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేస్తున్నారు. వర్షాల పరిస్థితిపై హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల కలెక్టర్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కృష్ణా నది పరీవాహక ప్రాంతాలు, ఇతర లోతట్టు ప్రాంతాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను, రహదారులపై కూలిన చెట్లను వెంటనే తొలగించాలని మంత్రి ఆదేశించారు.

మరోవైపు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉత్తరాంధ్రలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో భద్రతా కారణాల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకటి రెండు చోట్ల మినహా పెద్దగా సమస్యలు తలెత్తలేదని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని గొట్టిపాటి సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపుల సమయంలో విద్యుత్ తీగల పట్ల సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆయన ఆదేశించారు.ం

## ప్రతి ఇంటికి ఫ్యామిలీ కార్డు... ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు

- మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఒకే కార్డు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కొత్త ఫ్యామిలీ కార్డులో ఆ కుటుంబం పొందుతున్న ప్రభుత్వ పథకాలతో పాటు అన్ని రకాల వివరాలను నమోదు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారాన్ని అప్‌డేట్ చేస్తూ, పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబ అవసరాలను నేరుగా తెలుసుకోవాలని, ప్రభుత్వ సహాయం అవసరమైన వారికి తక్షణమే లబ్ధి చేకూరేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "కొన్ని ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు. అలాంటి వాటిని నివారించేందుకు, అందరికీ ప్రయోజనం కలిగేలా పథకాలను రూపొందించే అంశాన్ని పరిశీలిద్దాం" అని తెలిపారు. రాష్ట్రంలో త్వరలోనే ఒక నూతన జనాభా విధానాన్ని (పాపులేషన్ పాలసీ) కూడా తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇబ్బందుల్లో ఉన్న ఉల్లి రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతుల నుంచి ఉల్లిని తక్షణమే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు నుంచే క్వింటాకు రూ.1,200 చెల్లించి ఉల్లిని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు ఏ మేరకు ఉన్నాయనే అంశంపై ఈ సందర్భంగా చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాల అంశంపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బ తిన్న కారణంగా... మహారాష్ట్రలో ఉల్లి పంట ఎక్కువగా ఉన్న కారణంగా ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. వచ్చే పది రోజుల్లో 5 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉందని సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా ఉల్లిని రూ. 1,200 చొప్పున కొనుగోలు చేయండి. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించాలి. కమ్యూనిటీ హాళ్లను అద్దెకు తీసుకుని ఉల్లిని ఆరబెట్టాలి. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలి. ఉల్లికి రేటు వచ్చేంత వరకు కమ్యూనిటీ హాళ్లలో నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. రైతు నష్టపోకూడదు. వినియోగదారుడు ఇబ్బంది పడకూడదు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**రైతు బజార్ల ఆధునీకరణకు చర్యలు**

రాష్ట్రంలోని రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సీఎం మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రైతు బజార్ల సంఖ్యను పెంచాలని సూచించారు. వీటిని 150 నుంచి 200 వరకూ చేసేలా ప్రణాళిక చేయాలని అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ "రైతు బజార్లను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లాలి. మార్కెట్ యార్డుల్లోని 2-3 ఎకరాల భూమిని వినియోగించుకుని కొత్తగా ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చే యండి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలు వినియోగించాలి. ధరల నియంత్రణకు, ద్రవ్యోల్బణం పెరగకుం డా ఉండేందుకు ఈ చర్యలు ఉపకరిస్తాయి" అని సీఎం అన్నారు.

## ఏపీలోని అంతర్జాతీయ క్రీడాకారులకు గుడ్ న్యూస్

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రానికి చెందిన 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు రూ.4.9 కోట్ల నగదు ప్రోత్సాహకాలను విడుదల చేసినట్టు అధికారికంగా ప్రకటించింది. చాలాకాలంగా ఎదురుచూస్తున్న బకాయిలు విడుదల కావడంతో క్రీడాకారులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఈ నిర్ణయంపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ చర్య నిదర్శనమని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు ఈ వార్తతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా క్రీడాకారుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి రవినాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ మద్దతుతో క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## మోదీ ఎందుకు ఇలా చేస్తున్నారో.. అమెరికా ఆర్థికవేత్త ఆశ్చర్యం

- మొదటి పేజీ తరువాయి

ఇక దీనిపై నిర్ణయం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ పరిణతి చెందిన నాయకుడని కీర్తిస్తూనే ఆయన ఎందుకు ఇలా చేస్తున్నారో అంతుబట్టడం లేదని నవారో విమర్శించారు.

ఉక్రెయిన్ పై రష్యా దూకుడుకు పరోక్షంగా మోదీనే కారణమని ఆక్షేపించారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే కారణమని, ఇది 'మోదీ యుద్ధం' అని నవారో ఆరోపించారు. భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పీటర్ నవారో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి రాయితీపై భారత్ కొనుగోలు చేస్తున్న ముడి చమురు వల్ల ఉక్రెయిన్ పై దాడులు పెరుగుతున్నాయని పీటర్ నవారో చెప్పారు. ముడి చమురు అమ్మకాల ద్వారా సమకూరుతున్న డబ్బుతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెచ్చిపోతున్నారని, ఉక్రెయిన్ లో విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొనాలంటే భారత్ సహకరించాలని పీటర్ నవారో అభిప్రాయపడ్డారు.

## నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా బూతులు తిడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

అంబాసిడర్‌గా అభివర్ణించిన భూమన, ఆయనొక దోపిడీదారుడని, పైరవీకారుడని తీవ్ర విమర్శలు చేశారు. "జూబ్లీహిల్స్ సొసైటీలో బీఆర్ నాయుడు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. ఆయన బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. అతని అరాచకాలపై మా పోరాటం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు. క్విడ్‌ప్రో కిందనే బీఆర్ నాయుడుకి టీటీడీ చైర్మన్ పదవి దక్కిందని భూమన ఆరోపించారు. ఆ పదవిని అడ్డుపెట్టుకుని ఆయన రాజకీయాలు చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా

చేసుకుని నిరంతరం దూషణలకు దిగుతున్నారని అన్నారు. టీటీడీ చైర్మన్ పదవి శాశ్వతం కాదనే విషయాన్ని బీఆర్ నాయుడు గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా భూమన హెచ్చరించారు.

## ఎన్నికల వేళ బీహార్ లోకి చొరబడిన ఉగ్రవాదులు... హైఅలర్ట్

- మొదటి పేజీ తరువాయి

వర్గాలు హెచ్చరించాయి. ఈ సమాచారంతో అప్రమత్తమైన బీహార్ పోలీసు యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రస్తుతం రాష్ట్రంలో పర్యటిస్తుండటంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, రావల్పిండికి చెందిన హస్నైన్ అలీ, ఉమర్‌కోట్‌కు చెందిన ఆదిల్ హుస్సేన్, బహావల్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఉస్మాన్ అనే ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు నేపాల్ సరిహద్దు ద్వారా బీహార్‌లోకి చొరబడ్డారు. గత వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు నిర్ధారించాయి. దీంతో అధికారులు వెంటనే వారి ఫోటోలు, ఇతర వివరాలను అన్ని జిల్లాల పోలీసులకు పంపించారు. ముఖ్యంగా నేపాల్‌తో 729 కిలోమీటర్ల సరిహద్దు పంచుకుంటున్న జిల్లాలు, సీమాంచల్ ప్రాంతంలో భద్రతను గణనీయంగా పెంచారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, జనసమ్మర్థ ప్రదేశాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మరికొన్ని నెలల్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. గత మే నెలలో కూడా రాష్ట్రంలో 18 మంది అనుమానితులను గుర్తించగా, వారిలో ఒకరు ఖలిస్థానీ సానుభూతిపరుడిగా తేలడం గమనార్హం.

# తిరుమల ఘాట్ రోడ్లలో ఘనంగా వినాయక చవితి



తిరుమల పెన్ పవర్ ఆగస్టు 28 : వినాయక చవితి సందర్భంగా బుధవారం తిరుమల మొదటి మరియు రెండో ఘాట్ రోడ్లలో ఉన్న శ్రీ వినాయక స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి నుండి తిరుమలకు వెళ్లే రెండో ఘాట్ రోడ్డులోని శ్రీ వినాయక స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అదేవిధంగా, తిరుమల నుండి తిరుపతి కి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులోని వినాయక స్వామి ఆలయానికి గణేష్ చవితి సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.









# అర్హులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలి

## జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**కర్నూలు, పెన్‌పవర్, ఆగస్టు 28 :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి పలు ప్రభుత్వ అంశాలపై సమీక్షించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విజయవాడ నుండి అన్ని జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మైనర్ఇరిగేషన్ ట్యాంక్‌లు, గ్రౌండ్ వాటర్ లెవెల్, పెన్షన్‌లు, యూరియా సరఫరా పి.ఎం. కుసుమ్‌కు, ఎయిర్ ఫోర్స్ కొరకు భూమి సేకరణ, జూవైనల్ కేసులు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ వంటి మెదలగు విషయాలు చర్చించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ... అర్హులైన వారందరికీ పెన్షన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌లు ప్రత్యేక దృష్టి తో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డాక్యుమెంట్ అప్లోడ్ చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సబ్ స్టేషన్ లకు మరియు ఇతర ప్రభుత్వ అవసరాలకు భూములు వీలైనంత త్వరగా అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఈ సమావేశానికి జెసి డాక్టర్ బి.నవ్య,అడిషనల్ ఎస్పి హుసేన్ పీరా, డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి,ఇరిగేషన్ సిఈ బాలచంద్రారెడ్డి, డిఆర్డిఏ పి.డి రమణారెడ్డి, డ్వామా పిడి వెంకట రమణయ్య,కర్నూలు మున్సిపల్ కమీషనర్ విశ్వనాథ్, డిపిఓ భాస్కర్, జెడి అగ్రికల్చర్ వరలక్ష్మి, పిఆర్ఎస్ ఈ మద్దన్న,ట్రాన్సకో ఈఈ ఓబులేసు, ఐసిడిఎస్ పిడి విజయ, గ్రౌండ్ వాటర్ డిడి శ్రీనివాసులు, మైనారిటీస్ ఆఫీసర్ సాబీహాపర్వీన్, డిఎం మార్కఫెడ్ గద్వాల్ రాజు మొదలగు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం

## - మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ పవర్ పవర్ ఆగస్టు 28 :** ధర్మవరం పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యల నుండి శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ (MA&UD) Memo No. 2945970/I1/2025, తేదీ 28-08-2025 ప్రకారం, ధర్మవరం పట్టణ తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ కోసం రూ.2,54,64,746 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ "నా ధర్మవరం పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యల నుండి శాశ్వత పరిష్కారం కల్పించడం నా ప్రథమ కర్తవ్యం. ధర్మవరం పట్టణం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, గత కొన్నేళ్లుగా తాగునీటి సమస్యలు తీవ్రంగా ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు నేను నిరంతరం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి, ప్రతి దశలో కృషి చేశాను. ఆ కృషికి ఫలితంగా ఈ నిధులు మంజూరు అయ్యాయి" అని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా కలాజ్యోతి సర్కిల్ నుండి ఎర్రగుంటలోని 300 KL సాంప్ వరకు పాత AC పైపులైన్ తొలగించి, కొత్తగా 300 మి.మీ DI K9 క్లియర్ వాటర్ పంపింగ్ మెయిన్ పైపులైన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ పైపులైన్ అమలులోకి రాగానే పట్టణంలోని అన్ని కాలనీలు, కొత్త విస్తరణ ప్రాంతాలు సహా, ప్రతి ఇంటికి తగినంత శుద్ధమైన తాగునీరు అందేలా మౌలిక వసతులు బలోపేతం కానున్నాయి. మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ పనులకు కావలసిన నిధుల్లో 50% ధర్మవరం మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ నుండి, మిగిలిన 50% AHUDA నిధుల ద్వారా వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన ప్రారంభించి, వేగంగా పూర్తి చేయడం ద్వారా ధర్మవరం ప్రజలకు తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ ధర్మవరం పట్టణ ప్రజలకు హామీ ఇస్తూ, "ప్రతి కుటుంబానికి శుద్ధమైన తాగునీరు అందించడం మా కట్టుబాటు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఎల్లప్పుడూ ధర్మవరం అభివృద్ధికి తోడ్పడుతుంది. ధర్మవరం అభివృద్ధి కోసం మేము చేపట్టిన ప్రతీ ప్రాజెక్ట్ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే దిశగా ముందడుగు వేస్తోంది" అని అన్నారు.

## డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కేంద్రాలను

# పరిశీలించిన జాయింట్ కలెక్టర్





**కర్నూలు పెన్ పవర్ ఆగస్టు 28 :** మెగా డీఎస్సి-2025 నిర్వహణలో భాగంగా సర్టిఫికెట్ల ధ్రువీకరణ కేంద్రాలను కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నవ్య సందర్శించారు. విద్యాశాఖ రాష్ట్ర అధికారులు ప్రతాప్ రెడ్డి, అబ్రహం, కర్నూలు జిల్లా విద్యాధికారి ఎస్ శ్యామ్యూల్ పాల్ నంద్యాల జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డిలతో కలసి రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఆరు కేంద్రాలను, వెంకటేశ్వర బీఈడీ కాలేజీ,శ్రీనివాస బీఈడీ కాలేజీ లోని వెరిఫికేషన్ కేంద్రాలను పరిశీలించారు. వెరిఫికేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. సర్టిఫికెట్ల పరిశీల నిమిత్తం ఏఏ ప్రమాణాలు పాటిస్తున్నారన్న విషయాలపై అధికారులతో చర్చించారు. క్యాస్ట్ సర్టిఫికెట్ ధ్రువీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆన్లైన్ విధానంలో ప్రక్రియ మరింత వేగమతం అవ్వాలని ఆలస్యమయ్యేందుకు అవకాశం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించి అనుకున్న సమయంలో పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రక్రియ తీసుకున్నదని వివరించారు. సర్టిఫికెట్ ధ్రువీకరణ సందర్భంగా అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా అధిగమించాలనే విషయాలపై విద్యాశాఖ అధికారులు వెరిఫికేషన్ అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ వేగవంతమయ్యేందుకు ఇంటర్నెట్, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెరిఫికేషన్ బృందాలన్నీ సమిష్టిగా కృషి చేయాలని అనుకున్న సమయానికి పూర్తి చేయాలని తొలిరోజు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎప్పటికప్పుడు సమస్యలను అధిగమించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వీరుతోపాటు జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


# 29, 30న కుప్పం విచ్చేయనున్న ముఖ్యమంత్రి



**చిత్తూరు, పెన్ పవర్, ఆగస్టు 28 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆగస్టు 29 ,30 న కుప్పంకు విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఆగస్టు 29న బెంగళూరు విమానాశ్రమ నుండి బయలుదేరిసా 6.00 గం.లకు శాంతిపురం మండలం తుంసిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారని, అనంతరం శాంతిపురం మండలంలోని ముఖ్యమంత్రి కడేపల్లి స్వగృహమునందు ఆరోజు రాత్రి బస చేస్తారు,ఆగస్టు 30 ఉ.10.00 గం.లకు కడపల్లె, శాంతిపురం మండలం నందు ఉదయం సమయంలో స్వగృహం నుంచి బయలుదేరి హంద్రీనీవా కాలువ పరమ సముద్రం గ్రామానికి ఉ.10.30 గం. లకు గంగ హారతి కార్యక్రమంలో పాల్గొని, అనంతరం ఉ. 11.15 గం.లకు పరమ సముద్రం చెరువు పక్కన గల బహిరంగ సభకు చేరుకుని, ఉ. 11.20 గం. లకు అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొని, ఉ. 11.50 గం. లకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం మ. 2.00 గం. లకు పారిశ్రామిక వేత్తలు మరియు ఇతర విశిష్టులతో సమావేశంలో పాల్గొని, మ. 3.45 గం. లకు రోడ్డు మార్గంలో బహిరంగ సభ నుంచి పరమ సముద్రం గ్రామం నందు గల హెలిపాడ్ వద్దకు చేరుకొని 3.55 గం.లకు హెలికాప్టర్ లో 4.40 గం. లకు బెంగళూరుకు చేరుకోవడం జరుగుతుందని ఆ ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు.

# శ్రీ కోదండరామ స్వామివారి ఆలయ ధ్వజస్థంభ జీర్ణోదరణకు అంకురార్పణ





**కడప పెన్ పవర్ ఆగస్టు 28 :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ జీర్ణోదరణకు బుధవారం సాయంత్రం 6 గంటలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేలుకొల్పి, అర్చన జరిగింది. సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేనారాదన, పుణ్యాహవచన, రక్షాబంధన, అంకురార్పణ నిర్వహించారు. ఆగస్టు 28వ తేదీ ఉదయం 9 గంటలకు ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు, వాస్తు హోమం, పంచగవ్య స్నపనం, కుంభస్థాపనం, సయ్యాధివాసం, తత్వ హోమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.





# పట్టణ ప్రణాళిక సమస్యలపై ఓపెన్ ఫోరం

## - నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్

**కర్నూలు పెన్ పవర్ ఆగస్టు 28 :** కర్నూలు నగరంలో పౌరుల సమస్యలను ప్రత్యక్షంగా విని, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు శుక్రవారం "ఓపెన్ ఫోరం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి. విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎస్బిఐ ఉద్యోగుల కాలనీ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన ఎల్‌ఆర్ఎస్, నిర్మాణ అనుమతులు వంటి సేవలలో తలెత్తుతున్న ఇబ్బందులపై పౌరులు తమ సమస్యలను నేరుగా చెప్పవచ్చన్నారు. పౌరుల ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామని కమిషనర్ తెలిపారు. నగర ప్రజల నుండి అందిన సూచనలు, ఫిర్యాదులు మున్సిపల్ పాలనలో పారదర్శకత పెంచడమే కాకుండా వేగవంతమైన సేవలందించేందుకు తోడ్పడతాయని ఆయన వివరించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్యాల సాహితి

## సాదరంగా ఆహ్వానించిన పట్టణ న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులు



**షాద్నగర్, పెన్ పవర్ ఆగస్టు 28 :** హైకోర్టు ఉత్తర్వుల ఆదేశానుసారం షాద్ నగర్ కోర్టు కాంప్లెక్స్‌లో గల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో, నూతనంగా ఎన్నికైన మల్యాల సాహితి అడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు. కోర్టులో విధుల అనంతరం న్యాయ వాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణు గోపాలరావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు న్యాయవాద బార్ అసోసియేషన్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కొత్తవి కూడా హాజర య్యారు. న్యాయవాదులందరూ ఆమెకు సాదర పూర్వ కంగా ఆహ్వానం పలికిన తర్వాత పలువురు న్యాయ వాదులు ప్రసంగించారు. నూతనంగా న్యాయమూర్తిగా ఎన్నికైన తర్వాత మొట్టమొదటిసారిగా షాద్ నగర్ కోర్టులో పదవి బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోష కరమైన విషయమని పలువురు న్యాయవాదులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గా ఎన్నికైన మల్యాల సాహితీ సిద్ధిపేటకు చెందిన రాజు అన్నపూర్ణ దంపతుల కుమార్తె రాజు అన్నపూర్ణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ కమిటీ తో పాటు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభల ద్వారా సబ్ డివిజన్ కొరకు దరఖాస్తులు

## గ్రామసభలు ప్రజల సద్వినియోగం చేసుకోవాలి :జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి



**చిత్తూరు, పెన్ పవర్, ఆగస్టు 28 :** గ్రామ సభల ద్వారా సబ్ డివిజన్ కొరకు దరఖాస్తులు స్వీకరించబడును, జాయింటు పట్టాదారులకు వెసులుబాటు కల్పిస్తామని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి గురువారం ఓ ప్రకటన తెలిపారు. ప్రకటనలోని సారాంశం క్రింది విధంగా ఉన్నది. చిత్తూరు జిల్లాలో 2022- 2024 సంవత్సరంలో రీసర్వే పూర్తయిన గ్రామాలలో వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదు అయిన భూ యజమానులకు సంతోషకరమైన సమాచారం. రీసర్వే పూర్తి కాబడిన గ్రామాల యందు వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూ యజమానులకు వారి యొక్క భూములను విభజన చేయుటకు ప్రభుత్వం వారు నిర్దేశించిన 500 రూపాయల రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితముగా ఈ సేవను పొందుటకు ప్రభుత్వము వారు వెసులుబాటు కల్పించిందని తెలిపారు. దీనికి గాను కేవలము నామమాత్రపు దరఖాస్తు రుసుము 50 రూపాయలను గ్రామ సచివాలయము నందు చెల్లించి సెప్టెంబర్ 30 వ తేది లోపు దరఖాస్తు చేసుకోనవలసినదిగా తెలిపారు. జాయింటు హక్కు దారులుగా ఉన్న భూములపై తరచూ వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు, ప్రభుత్వం అమలు చేసిన పథకాల లబ్దిలో అడ్డంకులూ తలెత్తుతున్న నేపథ్యంలో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గత సంవత్సరంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన గ్రామ సభల్లో వచ్చిన ఆర్జీలను పరిశీలించి కొన్ని జాయింట్ ఎల్.పీ.ఎం.లను పరిష్కరించడం జరిగింది. జనవరి 2025 లో సబ్ డివిజన్ అప్లికేషన్ రుసుమును రూ.500 నుండి రూ.50 కనిష్ట సేవా చార్జిగా తగ్గించడం జరిగింది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 319 గ్రామాలలో ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఈ డ్రైవ్‌ను సెప్టెంబర్ 30వ తేది వరకూ మాత్రమే వర్తించనుంది. అందువలన రైతులు సెప్టెంబర్ 30వ తేది లోపల తమ జాయింటు భూముల పై వ్యక్తిగత హక్కుల కోసం అవసరమైన దరఖాస్తులు చేసుకోవలెను అని జాయిటు కలెక్టరు గారు సూచించారు. ఈ సబ్ డివిజను డ్రైవ్ ద్వారా రైతులు తమ భూమిపై పూర్తి హక్కుతో వ్యవహరించ గలుగుతారు. ప్రభ్వు పథకాల లబ్ది పొందగలుగుతారు, రిజిస్ట్రేషన్, రుణాలు పొందడం వంటి కార్య కలాపాల్లో సులభతరం అవుతుంది. ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యం జాయింట్ పట్టాదారులకు స్పష్టమైన వ్యక్తిగత హక్కులు కల్పించడం, ఇందులకు గాను రెవెన్యూ మరియు సర్వే అదికారులు 29.08.2025 మరియు 30.08.2025 తేది నందు సంబంధిత గ్రామ సచివాలయము నందు పై విషయముగా గ్రామ సభ నిర్వహించబడి జాయింట్ పట్టాదారు వద్ద నుండి ఆన్ లైన్ సబ్ డివిజన్ కొరకు అర్జీలను స్వీకరించబడును. జాయింట్ పట్టాదారులు అందరూ గ్రామ సభ నందు హాజరై ఈ సదవకాసమును ఉపయోగించుకుని జాయింట్ పట్టాలను విభజన చేయించు కోవలసినదిగా కోరడమైనది. దీని వలన ప్రభుత్వ సంక్షేమ పతకములైన "అన్నదాత సుఖీభవ " మరియు "తల్లికి వందనం" మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకములకు అర్హులుగా గుర్తించబడుదురని తెలియపరచడమైనది. కావునపై అవకాసమును సద్వినియోగం చెసుకోవలసి ఉన్నదని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టరు వారుపై ప్రకటనలో తెలిపారు.

# జల హారతిలో ప్రతి ఒక్కరు పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలి



### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**కుప్పం, పెన్ పవర్ ఆగస్టు28 :** నియోజకవర్గంలో హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా ఇరువైపుల స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు విరివిగా పాల్గొని జల హారతి కార్యక్రమాలను విజయవంతం చేయాలిఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కడ కార్యాలయం లోని సమావేశ మందిరంలో ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి హంద్రీనీవా కాలువ ద్వారా పరమ సముద్రం చెరువు నందుజలహారతికార్యక్రమాలలో పాల్గొంటారు, ఆ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సంబంధిత వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, స్పెషలాఫీసర్లు, మండల స్థాయి అధికారులు నాలుగు మండలాలలో హంద్రీనీవా కాలువ ప్రవశించే ప్రాంతాలలో రైతులనుజలహారతికార్యక్రమాలలో పాల్గొనే విధంగా ముందుస్తే ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి మణికంఠ చందోల, కడపిడి వికాస్ మరమత్, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈనెల 30 తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో జల హారతి కార్యక్రమాలలో పాల్గొంటారు, వారి పర్యటన విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు మండలాలలో సుమారు హెచ్ఎన్ఎస్ కెనాల్ 49 కిలోమీటర్ల ప్రయాణిస్తుందని ఆ కెనాల్ సమీపంలో సంబంధిత రైతులు జల హారతి కార్యక్రమాలలో పాల్గొనివిజయవంతంచేయాలని తెలిపారు, రామకుప్పం, శాంతిపురం, కుప్పం, గుడిపల్లి మండలాలకు ప్రత్యేక స్పెషల్ అధికారులు ఏర్పాటు చేయడం జరిగిందని, వ్యవసాయ, ఉద్యానవన, ఏపీఎంఐపీ, జిఎం ఇండస్ట్రీ, జిల్లా అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు.

కుప్పం నియోజకవర్గంలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయి ఇతర నియోజకవర్గాలలో పోలిస్తే కుప్పం నియోజకవర్గం చాలా తక్కువ శాతం ఉన్నదని తెలిపారు, జలహారతులు రైతులు విరివిగా పాల్గొని, నీటి విశిష్టతను గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి ఆలోచనతో ఈ కార్యక్రమంనిర్వహించుచున్నామని తెలిపారు, అందుకు ప్రతి మండలంలో రైతు సేవ కేంద్రాలలో పనిచేసే సిబ్బంది, తెలుగు సిబ్బంది, నాలుగు మండలాలలో ఒక్కొక్క మండలంలో హంద్రీనీవా ప్రవహించే కాలవలు ద్వారా 25 పాయింట్లు గుర్తించి అక్కడ జల హారతి కార్యక్రమాలను విజయవంతం చేయడానికి మండల స్థాయి సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఈనెల 30వ తేదీన 10.30 ఉదయం నుండి 11.15 గంటల వరకు ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి పాల్గొంటారని, ఆ సమయంలో కెనాల్ ప్రవహించే ప్రాంతాలలో కెనాల్ కి ఇరువైపుల రైతులు పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క స్థానిక ప్రజా ప్రతినిధులను ఆయా కార్యక్రమాలలో ఆహ్వానం పలకాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి లొకేషన్ నందు పోలీస్ సిబ్బంది నియమించడం జరిగిందని, జల హారతి కార్యక్రమాలలో, వృద్ధులను, పిల్లలను ఆహ్వానించకండి ఆదేశించారు, నీటి యొక్క విశిష్టతను గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయవలసిన బాధ్యత మన అందరి పై ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ, ఆర్టికల్చర్ డిడి మధుసూదన్ రెడ్డి, సెరికల్చర్ జెడి పద్మావతి, డిపిఓ, సుధాకర్ రావు, ఇండస్ట్రీ జిఎం సూరిబాబు, ఇతర శాఖల అధికారులు, నాలుగు మండలాల వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భూ సమస్యలు పెండింగ్ లేకుండా

## ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా






**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు 28 :** జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా పుష్కలంగా ఉందని ఎక్కడ కూడా యూరియా సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. గురువారం అమరావతి సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్, ఎంఐ ట్యాంకులు, గ్రౌండ్ వాటర్, పీఎం- కుసుమ్‌కు సంబంధించిన భూ సమస్యలు, పెన్షన్లు, సానుకూల ప్రజా దృక్పథం, యూరియా లభ్యత, ధర నిర్ణయం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు అవసరమైన యూరియా పుష్కలంగా ఉందని ఏ ఒక్క రైతు కూడా యూరియా సమస్య ఉన్నట్లు ఎక్కడ కూడా రాకూడదన్నారు.యూరియాను అధిక ధరలకు విక్రయించినట్లయితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు తమ పంటలకు ఎక్కువ మోతాదులో యూరియా వాడకూడదని అవసరం మేరకు మాత్రమే యూరియా వాడాలన్నారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల మరమ్మతులు కాలువలలో పూడిక తీత తదితర పనులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు నీటి సంరక్షణ పనులను విరివిగా చేపట్టాలన్నారు. పెన్షన్ల సమస్యపై లబ్ధిదారులతో సానుకూలంగా మానవతా దృక్పథంతో మాట్లాడి లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలో వంద శాతం భూ సమస్యలు పరిష్కరించేం దుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా భూ సమస్యలు వస్తుంటాయని వీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధచూపి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## "పులివెందుల సబ్ జైలు విజిట్"




**కడప పెన్ పవర్ ఆగస్టు 28 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో పులివెందుల సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాది, పారా లీగల్ వాలంటరీ మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలి

### - వ్యవసాయ విస్తరణ అధికారి అరుంధతి




**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 28 :** రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలని పొదిలి వ్యవసాయ శాఖ విస్తరణాధికారి కె.అరుంధతి చెప్పారు. గురువారం నాడు మండలంలోని మాదాల వారి పాలెం, ఓబులక్కపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతు లతో విస్తరణాధికారి అరుంధతి సమావేశం జరిపారు. ఈ సందర్భంగా అరుంధతి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగపరచుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అలాగే రైతులు సాగు చేసిన పంటల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను అరుంధతి రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బందితోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

### "జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి

## మంత్రి సత్యకుమార్ సానుకూల హామీ"




**ధర్మవరం, పెన్ పవర్ ఆగస్టు 28 :** రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. హిందూపురం డివిజన్ ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు రాజగోపాల్ ఆరోగ్య పరిస్థితి గురించి చర్చించడానికి ధర్మవరం ఏపీయూ డబ్ల్యూజే రెవెన్యూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు చింతకాయల పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి డి.బాబు గురువారం మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో కలిశారు. రాజగోపాల్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని వివరించిన ఏపీయూడబ్ల్యూజే కమిటీ, సహకారంగా సేకరించిన రూ.25,000 ఆర్థిక సహాయాన్ని మంత్రి చేతుల మీదుగా అందజేసింది. అనంతరం రాజగోపాల్ అనారోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు చలించిపోయారు. ఆయన ఆరోగ్యం ఎప్పటి నుంచి బలహీనమవుతోందో, ప్రస్తుత దశ ఏంటో, చికిత్స కోసం ఖర్చవుతున్న వ్యయాలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి, తన వ్యక్తిగత వంతు సహాయంగా మరో రూ.25,000 అందజేసి ఉదారత చాటుకున్నారు.



దీంతో ఏపీయూడబ్ల్యూజే తరఫున రూ.25,000తో పాటు, మంత్రి తరఫున రూ.25,000 ం మొత్తం రూ.50,000 ఆర్థిక సహాయం బాధితుడు రాజగోపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు ప్రస్తావించిన పలు సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. అర్హులైన పాత్రికేయులందరికీ ఇంటి పట్టాల పంపిణీకి ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయని, ఈ విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ మరియు ఇంటి స్థలాల కేటాయింపుపై ముఖ్యమంత్రి తరచూ చర్చలు జరుపుతున్నారని వెల్లడించారు. విలేఖరుల రైల్వే ప్రయాణానికి 50 శాతం సబ్సిడీ పాస్ సౌకర్యం కల్పించడానికి ప్రత్యేక చర్చలు జరిపినట్లు, దీనిపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుందని తెలిపారు.

పాత్రికేయులకు ఉచిత వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ ప్రతిపాదనపై ఇప్పటికే ముఖ్యమంత్రితో చర్చలు జరిగాయని, త్వరలో ఈ పథకం అమలులోకి వస్తుందని అన్నారు. ధర్మవరం ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ నిర్మాణానికి స్థలం కేటస్తామన్నారు, ఇందుకు సంబంధించి స్థలాన్ని గుర్తించడానికి మరియు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణకు తక్షణ చర్యలు ప్రారంభించాలని ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబుకు సూచించారు. పాత్రికేయుల అభ్యర్థన మేరకు త్వరలోనే ధర్మవరం పట్టణంలో మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తాము ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జీ.వి నారాయణ, జిల్లా అధ్యక్షులు చింతకాయల పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి డి. బాబు, సీనియర్ నాయకులు భుజంగరావు జిల్లా ఉపాధ్యక్షులు జయనందన్ రెడ్డి, ధర్మవరం ఉపాధ్యక్షులు గోల్డ్ ప్రసాద్, విశాలాంధ్ర రాఘవ, జిల్లా నాయకులు జయశంకర్,కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## "గిరిజన ప్రజలలో బాల్య వివాహాలు - చిన్న వయసులోనే గర్భధారణ అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు"




**కడప, పెన్ పవర్ ఆగస్టు 28 :** 28న గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారి సూచనలు మేరకు కడప నగరం దండు గిరిజనుల కాలనీ నందు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా (గిరిజన హక్కుల రక్షణ మరియు అమలు) పథకం 2015, నల్సా (సంవాద్ - అట్టడుగు బలహీన ఆదివాసులు మరియు డినోటిఫైడ్ / సంచార తెగలకు న్యాయం పొందే అవకాశాన్ని బలోపేతం చేయడం,) పథకం 2025, నల్సా (ఆశ అవగాహన మద్దతు సహాయం మరియు చర్య) బాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానం 2025, గిరిజన ప్రజలలో బాల్య వివాహాలు - చిన్న వయసులోనే గర్భధారణ అంశాలపై అవగాహన కలిగించడం జరిగినది, పిల్లలు బాగా చదివించి ఉన్నత స్థానాలకు చేర్చాలి, విద్య హక్కు చట్టం, వివాహ వయస్సు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి, భారత రాజ్యాంగం, ఆర్టికల్ 21, 1098 హెల్ప్ లైన్, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్‌లైన్-15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456 మొదలు అంశాలను తెలియజేశారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగలై ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు ప్రవీణ్ కుమార్ మరియు రవితేజ, రెడ్స్ ఎన్జీవో కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ మరియు సిఎస్డబ్ల్యూ నిర్మల, పారా లీగల్ వాలంటరీ ఈశ్వరయ్య, గిరిజనులు పాల్గొన్నారు.

## రాష్ట్ర జిల్లా గ్రంధాలయ సంస్థ పరిషత్ చైర్మన్ విదేశ పర్యటన విజయవంతం

**సి.ఎస్.పురం, పెన్ పవర్, ఆగస్టు 28 :** రాష్ట్ర జిల్లా గ్రంధాలయ సంస్థ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అమెరికా పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశానికి విచ్చేసిన సందర్భంగా సిఎస్పురం గ్రంథ పాలకుడు, ప్రకాశం జిల్లా గ్రంధాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు ఆళ్ల భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్లాంటా, వర్జీనియా, న్యూయార్క్, డల్లాస్ ప్రాంతాలలోని అనేక గ్రంధాలయాలను సందర్శించి ఆ ప్రాంతాలలోని విధి విధానాలను, సాంకేతిక వనరులను, పాఠకులకు అందిస్తున్న సౌకర్యాలను సమీక్షించి, అమెరికా పర్యటన ద్వారా ఆధునిక గ్రంథాలయాల సదుపాయాలు పాటక కేంద్రీత విధానాలను తెలుసుకొని ఆ అనుభవంతో రాష్ట్రంలోని గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడుతుందని, విజయవంతంగా పూర్తి చేసుకొని నరసరావుపేటకు విచ్చేసిన సందర్భంగా స్వదేశగమన శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

### శ్రీ కపిలేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వినాయక చవితి

**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 28 :** తిరుపతిలోని శ్రీ కపిలేశ్వర స్వామి ఆలయంలో వినాయక చవితిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో శ్రీ వినాయకస్వామి వారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం మూషిక వాహనంపై శ్రీ వినాయక స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సుపరింటెండెంట్ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సర్దార్ ఖాజా మొయినుద్దిన్‌కు డాక్టరేట్




**కడప పెన్ పవర్, ఆగస్టు 28 :** యోగి వేమన విశ్వ విద్యాలయ కళాశాల ఉర్దూ శాఖ అకాడమిక్ కన్సల్టెంట్ సర్దార్ ఖాజా మొయినుద్దిన్‌కు తమిళనాడు రాష్ట్రం వేల్లూరు తిరువల్లు వర్ విశ్వ విద్యాలయం ఉర్దూ విభాగంలో డాక్టరేట్ ప్రకటిం చింది. ఈయన డాక్టర్ మహ్మద్ యాసిర్ మార్గ దర్శకంలో "తీహ కిక్ ఓ తన్కీద్ కా ఇర్తేకా:శోభ - ఇ-ఉర్దూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కా కిర్దార్ " అనే అంశంపై చేసిన పరిశోధన కు డాక్టరేట్ అందజేశారు. సర్దార్ ఖాజా మొయినుద్దిన్ రాసిన 315 పరిశోధన పత్రాలు వివిధ జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమ య్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఈయనకు వైవియూ అధ్యాపకులు, ఉర్దూశాఖ విభాగాధిపతి,సహ అధ్యాపకుల అభినందించారు.









కడపలో వాడవాడలో కొలువైన గణపతి దేవ మూర్తులు

## 31న మహతిలో శ్రీ ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి మహోత్సవం

**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 28 :** సెప్టెంబరు 1 నుండి 10వ తేదీ వరకు "హరికథ వైభవం" హరికథ పితామహునిగా వినుతికెక్కిన శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 31వ తేదీ తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో జయంతి మహోత్సవం వైభవంగా జరుగనుంది. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 1 నుండి 10వ తేదీ వరకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ కళాకారులకు " హరికథ వైభవం " పేరిట శిక్షణ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమం వారి నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు ఉపయోగపడనుంది. ఎంపిక చేసిన 180 మంది హరికథకులకు తిరుపతి శ్వేత భవనంలో ఉచితంగా శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక నెలలో 30 మందికి పదిరోజుల చొప్పున 6 నెలల పాటు శిక్షణ జరుగనుంది. హరికథలో ప్రవేశమున్న వారు వారి నైపుణ్యాలను మరింతగా మెరుగు పరచుకునేందుకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో వారి పేర్లను నమోదు చేసుకోవాలని హిందూధర్మ ప్రచార పరిషత్ కోరుతోంది. హరికథ యందు ఇదివరకే ప్రవేశం ఉన్నవారు మాత్రమే నమోదుకు అర్హులు. శిక్షణ కోసం వచ్చిన కళాకారులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. శిక్షణ అనంతరం "హరికథ పత్రం" అందిస్తారు. ఇందులో భాగంగా ఆగస్టు 31వ తేదీ ఉదయం 9 గంటల నుండి హరికథ ప్రాశస్త్యము, హరికథ-ధర్మ ప్రచారం, శ్రీ ఆదిభట్ల నారాయణదాసు జీవిత విశేషాలు, ప్రముఖ కళాకారులతో హరికథాగానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా ఈ నెల 31న తేదీన ఉదయం 8.30 గంటలకు ఎస్వీ సంగీత కళాశాల ప్రాంగణంలోని శ్రీ ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, బృందగానం నిర్వహిస్తారు. నారాయణదాసవర్యులు 1864, ఆగస్టు 31వ తేదీన విజయ నగరం జిల్లా అజ్జాడ గ్రామంలో శ్రీలక్ష్మీనరసమాంబ, వేంకటచయన దంపతులకు జన్మించారు. సంగీత, సాహిత్యాల్లో బాల్యం నుంచే ఈయన అద్భుతమైన ప్రతిభాపాటవాలు ప్రదర్శించేవారు. పోతన భాగవత పద్యాలు, ఇతర శతక పద్యాలను ఐదేళ్ల ప్రాయంలోనే అవలీలగా వల్లించేవారు. ఉపమాన ఉపమేయాలను పోషించడంలో నారాయణదాసవర్యులు కాళిదాస మహాకవికి సమానమైనవారు. ఈయన సావిత్రిచరిత్ర, జానకీశపథం, భక్తమార్కండేయ చరిత్ర, రుక్మిణీ కల్యాణం హరికథా వ్యాయం తదితరాలు ఏకకాలంలో ఐదు విధాల లయలను ప్రదర్శించడం ఈయనకే సాటి. ఈయనకు పంచముఖేశ్వర అనే బిరుదు ఉంది. సంగీత, సాహిత్యాలను సరితూచిన త్రాసు నారాయణదాసు అని తిరుపతి వేంకటకవులు, శ్రీశ్రీ లాంటి మహానుభావులు కొనియాడారు.

# మంత్రుల సమావేశం రద్దు

### - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 28 :** జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి ఈ నెల 29 న కర్నూలు నగరంలో నిర్వహించనున్న మంత్రుల సమావేశం రద్దు అయినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ నెల 29 వ తేదీన జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి నిర్వహించనున్న సమావేశం రద్దు అయిందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు, ప్రజా ప్రతినిధులు గమనించాల్సిందిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ 2 రాజుపాలెం కాంప్లెక్స్ చైర్మన్ చంద్రశేఖర్



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 28 :** కొమరోలు మండలంలోని పలు మండల ప్రాథమిక పాఠశాలలను కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం రాజుపాలెం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ చంద్రశేఖర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. మంగళవారం ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం మండలంలోని జి వెంకటాపురం లో గల మండల ప్రాథమిక ఏకోపాధ్యాయ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు ఆ సందర్భంగా పాఠశాలల్లో అమలు జరుగుతున్న విద్యా విధానం విద్యార్థులకు అందిస్తున్న బోధన నాణ్యత మధ్యాహ్న భోజనం నాణ్యత తదితర వాటిని పరిశీలించారు ఆ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుడు మొగల్ బేగ్ కు పలు సూచనలు సలహాలు ఇచ్చారు..విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు స్వీకరించారు ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయుడు బేగ్, సిఆర్పి రామాంజి తదితరులు పాల్గొన్నారు. కాగా రాజుపాలెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కూరాకు వారి పల్లె లోని మండల ప్రాథమిక పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జీవి చంద్రశేఖర్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు ఆ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసులు, సహోపాధ్యాయుడు కిరణ్ కుమార్, సిఆర్పి రామాంజి పాల్గొన్నారు. అనంతరం ఆయన మలికే పల్లెలలో గల మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. మలికే పల్లె మండల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆ కార్యక్రమంలో మలికే పల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుజాత, సహోపాధ్యాయుడు వెంకటేశ్వర్ రెడ్డి, సిఆర్పి రామాంజి తదితరులు పాల్గొన్నారు.


## కూనిపాలెం గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం




**వలేటివారిపాలె పెన్ పవర్ ఆగస్టు 28 :** వలేటివారిపాలెం మండలంలోని కూని పాలెం రైతుసేవ కేంద్రం లో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కె.వి.శేషారెడ్డి గురువారం నిర్వహించారు. గ్రామంలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలలో అనుసరించాల్సిన మెళుకువలు మరియు చీడపీడల నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు తమ పొలాలను పంట వేసిన ఈ పంటలో నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ యంత్రాల సర్వే లో రైతులు తమ దగ్గర ఉన్న ట్రాక్టర్ గొర్రు నాగళ్లు ఇతర యంత్రాలను వ్యవసాయ సిబ్బంది ద్వారా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మన జీవితానికి అసలైన అర్థం ఏమిటి?

### - సేకరణ సమ్మిరెడ్డి పెన్ పవర్



**కడప పెన్ పవర్ ఆగస్టు 27 :** గురువు ద్రోణాచార్యుడు

గురువైన ద్రోణాచార్యుడు బ్రాహ్మణుడు, విలువిద్యలో ప్రావీణ్యుడు, కానీ చాలా పేదవాడు. కుటుంబంలో ద్రోణాచార్యుడు, అతని భార్య , వారి కుమారుడు అశ్వత్థామ.. ముగ్గురు సభ్యులు మాత్రమే ఉన్నా, రోజు గడవడం కష్టంగా ఉండేది. ఆ సమయంలో అశ్వద్ధామకు 5 సంవత్సరాలు. ఒక రోజు, అశ్వద్ధామ తన తోటి పిల్లలలో ఒకరు పాలు త్రాగడం చూశాడు. దీంతో అతనికి కూడా పాలు త్రాగాలనే కోరిక కలిగి, తల్లి దగ్గరకు వెళ్లి, "అమ్మా, నాకూ పాలు త్రాగాలని ఉంది." అని అడిగాడు. అయితే పాలు ఎక్కడి నుంచి వస్తాయి! తినడానికే తిండి దొరకని స్థితిలో ఆ తల్లి తన బిడ్డకు పాలు ఎక్కడ నుండి తెచ్చి ఇవ్వగలుగుతుంది. తల్లి హృదయం తపించిపోయింది. కానీ తన పిల్లవాడు సంతృప్తి కోసం ఏదో ఒకటి చేయాలి కదా. అందుచేత ఆమె నీళ్లలో కొంచెం గోధుమపిండిని కలిపి, "ఇదిగో పాలు త్రాగు" అని బిడ్డకు ఇచ్చింది. బిడ్డకు పాల రుచి తెలియకపోవడం వలన ఆ పిండి నీళ్ళే పాలు అనుకుని త్రాగేశాడు. అది విని తండ్రైన ద్రోణాచార్యుని హృదయం తల్లడిల్లి పోయింది. తన కోసం గొప్ప సంపదను, కీర్తిని సంపాదించుకుంటానని లేదా చనిపోతానని భీకర ప్రతిజ్ఞ చేశాడు. అయితే దాని కోసం ఏమి చేయాలా, ఏ దిశలో వెళ్ళాలా అని ఆలోచించడం ప్రారంభించాడు ... ద్రోణాచార్యుడికి పాంచాలదేశ రాజైన ద్రుపదుడు గుర్తుకొచ్చాడు. ద్రుపదుడు విద్యార్థి దశలో తన సహచరుడు, వారిద్దరూ ఒకే గురుకులంలో విద్యను అభ్యసించారు. ఎన్నో ఆశలతో ద్రోణాచార్యుడు ఆశలరథాన్ని అధిరోహించి, పాంచలదేశపు రాజధాని దిశగా కాలినడకన ప్రయాణం సాగించాడు. దారిలో చాలా కష్టాలు ఎదుర్కున్నాడు. కానీ సంపద మీద ఉన్న ఆశ వల్ల ఆ కష్టాలు కూడా అతనికి ఆహ్లాదకరంగా అనిపించాయి. చాలా రోజులు ప్రయాణించిన తర్వాత చివరకు ద్రోణాచార్యుడు పాంచలదేశ రాజధానికి చేరుకున్నాడు. అతను రాజధానికి చేరుకున్న వెంటనే, ద్రుపద మహారాజుని కలుసుకోగలుగుతాడని, అతను తనను పలకరిస్తాడని, చాలా గౌరవంగా చూస్తాడని, సహాయం చేస్తాడని అనుకున్నాడు, కానీ అతనికి తెలియని విషయం ఏమిటంటే, ద్రుపదుడు ఇప్పుడు తన పూర్వగురుకుల విద్యార్థి కాదు. ఇప్పుడతను ఒక పెద్ద రాజ్యానికి అధిపతి, చక్రవర్తి ... ఎల్లప్పుడూ సైనికులు, మంత్రులు అతని చుట్టూరా ఉంటారు. బయటవారిని ప్రక్కన పెడితే, తన స్వంత ప్రజలను కూడా అతను అతికష్టం మీద కలుసుకోగలుగుతాడు. చాలా రోజులు ప్రయత్నించిన తర్వాత ద్రోణాచార్యుడు ఎట్టకేలకు ద్రుపదుడిని కలవడంలో విజయం సాధించాడు. కానీ ద్రుపదుడు వెన్నుపోటు పొడిచాడు. సహాయం చేయడానికి బదులుగా, అతనిని గుర్తించడానికి కూడా నిరాకరించాడు. ద్రోణాచార్యుని మనసు, ఆత్మ విచలితమైపోయాయి. అతనికి ఇప్పుడు ప్రపంచం పట్ల, ముఖ్యంగా మనుషుల పట్ల తీవ్రమైన ద్వేషం ఏర్పడింది. అతను సన్యాసి అయిపోయి, అడవితల్లి ఒడిలో తన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నాడు. ద్రోణాచార్యుడు సన్యాసి అవుదామని కాలినడకన హరిద్వార్ వైపు బయలుదేరాడు. హస్తినాపురం చేరుకున్న ద్రోణాచార్యుడు, ఒకరోజు సాయంత్రం అయ్యేసరికి బాగా అలసిపోయి, ఒక బావి దగ్గరికి వచ్చాడు. ఆ బావి వద్ద ఆ రాత్రి గడపాలనుకున్నాడు, కాని అతను అక్కడ ఉన్న పాండవ - కౌరవ యువరాజులను చూసి ఆశ్చర్యపోయాడు. వారతనికి తెలియకపోయినా, వారి రూపాలని, సంభాషణలను బట్టి, వారు పాండవ - కౌరవ యువరాజులని తెలుసుకున్నాడు. రాజకుమారులు ఆ బావి దగ్గర బంతి ఆట ఆడుతున్నారు. కాసేపటికి బంతి బావిలో పడింది. వారు బంతిని బయటకు తీయడానికి తీవ్రంగా ప్రయత్నించారు, కానీ సాధ్యం కాలేదు. రాజకుమారుల ఆందోళన ద్రోణాచార్యుని కదిలించింది. అందుకని వారితో, "బాధపడకండి, నేను క్షణంలో బావిలో నుండి బంతిని బయటకు తీస్తాను", అని చెప్పాడు. ద్రోణాచార్యుడు విలువిద్యలో అత్యంత ప్రావీణ్యత ఉన్న పండితుడు. ఇతర పండితులైన బ్రాహ్మణులు తమ వద్ద పురాతన మహాగ్రంధాలను ఉంచుకుంటే, ద్రోణాచార్యుడు మాత్రం ఎక్కడికి వెళ్లినా తన వెంట విల్లు- బాణాలను తీసుకెళ్లేవాడు. బావి అంచు వద్ద నిలబడి లోపల పడిన బంతిని గురిపెట్టి బాణం వేశాడు. బాణపు మొన బంతిని గుచ్చుకుని, బాణం నిటారుగా నిలిచింది. ద్రోణాచార్యుడు మొదటి బాణంపై రెండవ బాణాన్ని వేసాడు, అది మొదటి బాణాన్ని గుచ్చుకుని నిటారుగా నిలబడింది. ఇదే పద్ధతిలో ఒకదాని వెనుక మరో మూడు నాలుగు బాణాలు వేశాడు. బాణాలన్నీ ఒకదానికొకటి గుచ్చుకుని నిటారుగా నిలబడ్డాయి. ద్రోణాచార్యుడు చివర వేసిన బాణం పట్టుకుని బయటకు లాగగా, బావిలో నుండి అన్ని బాణాలతో పాటు బంతి కూడా బయటకు వచ్చేసింది. రాకుమారులు తమ బంతిని చూడగానే చాలా సంతోషించారు. వారు ద్రోణాచార్యుని విలువిద్య నైపుణ్యానికి, అతని యుక్తికి చాలా ఆకర్షితులయ్యారు. వారు అతనిని దేవవ్రతుని వద్దకు తీసుకువెళ్లారు, ఎందుకంటే ఆ రోజుల్లో యువరాజులు దేవవ్రతుని సంరక్షణలోనే ఉండేవారు. ద్రోణాచార్యుని విలువిద్యా నైపుణ్యాన్ని రాకుమారులు గొప్పగా ప్రశంసించారు. ద్రోణాచార్యునితో మాట్లాడిన తర్వాత దేవవ్రతుడు చాలా సంతోషించి, ద్రోణాచార్యుడిని యువరాజులకు విలువిద్య నేర్పడానికి గురువుగా నియమించాడు. ద్రోణాచార్యుని కోరిక నెరవేరింది. గురుస్థానంలో ఉంటూ సంపదను పొందడమే కాకుండా ఎన్నో పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. తగిన సమయం ఆసన్నమయినప్పుడు, ఈ విధంగా మనిషి యొక్క విధి ప్రకాశిస్తుంది. తన కొడుక్కి పాలకు బదులు నీళ్లు ఇవ్వవలసివచ్చిన అదే ద్రోణాచార్యుడు, పాండవులకు, కౌరవులకు పూజ్యులైన ఆచార్యుడు అయ్యాడు. జీవితం అంటే క్రమమైన అభివృద్ధి . ప్రతి జీవితం క్రమంగా అభివృద్ధి చెందుతుంది. జీవితంలో వైఫల్యాలు, పోరాటాలు కూడా మనకు చాలా నేర్పుతాయి. అవే భవిష్యత్తులో మన ఎదుగుదలకు దారి తీస్తాయి.

**దాజీజి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాద బృందం ఆంధ్రప్రదేశ్**

# వైద్యాధికారులకు టిఓటి శిక్షణ కార్యక్రమం...






**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 28 :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాల కృష్ణ నాయక్ అధ్యక్షతన జిల్లా లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎమ్మెల్‌హెచ్‌పీలు, ఎఎన్ఎమ్ లకు RCH 2.0( పునరుత్పత్తి మరియు శిశు ఆరోగ్య సంరక్షణ) పై TOT శిక్షణా కార్యక్రమము నిర్వహించ బడింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు సేవలు మెరుగు పరచుకోవడంపై ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా లో ఎక్కడా కూడా మాతా శిశు మరణాలు జరుగకూడదని అందులో భాగంగానే ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించ బడుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ శాంతకుమారి, డిపి ఎమ్ఓడాక్టర్ శ్రీనివాసరావ్, ఎస్ఓ నాగేంద్ర కుమార్, డిపి హెచ్ఎన్ఓ మంజుల పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం పెన్ పవర్ ఆగస్టు 28 :** స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ తో అక్రమాలకు చెక్ పెట్టవచ్చునని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు అన్నారు. మండలంలోని తన స్వంత గ్రామం బడేవారిపాలెంలో గురువారం ఉదయం స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలకు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని ఋూ. గ్రామంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా స్వయంగా కలవచ్చుని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకతకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది అన్నారు.అందులో భాగంగా పేదలకు అన్ని అవసరాలకు ఉపయోగపడే విధంగా రైస్ కార్డులు స్థానంలో క్యూఆర్ కోడ్ ఉండే స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.. ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా స్మార్ట్ రేషన్ కార్డులు రూపొందించింది అన్నారు. కార్డు దారుల బయోమెట్రిక్ ఓటిపి ద్వారా కార్డు పొందవచ్చునన్నారు.. ఇప్పుటి వరకు రైస్ కార్డులో ఆ కుటుంబానికి చెందిన సభ్యులందరి ఫోటో ఉండేదని ఇప్పుడు ఆస్థానంలో కుటుంబ యజమాని ఫోటో ఉంటుందని ఇతర కుటుంబ సభ్యుల పేర్లు మాత్రమే నమోదు చేస్తారని తెలిపారు.గతంలో రేషన్ కార్డు పై అధికారంలో ఉండే సీఎం ఫోటోలు ఉండేవని స్మార్ట్ కార్డులో ప్రభుత్వ చిహ్నం మాత్రమే ఉంటుందన్నారు ప్రస్తుతం ఇవ్వనున్న స్మార్ట్ కార్డులు బ్యాంక్ డెబిట్ కార్డులు తరహాలో ఉన్నాయన్నారు .ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ నయీం అహ్మద్, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికొండ సింహాద్రి, పార్టీ నాయకులు పొడపాటి నరసింహం ఇంటూరి శంకరయ్య, కృష్ణ, గురజాల బెంజిమెన్, వలేటి లక్ష్మీనరసింహం, గుత్తా మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



## రవాణా శాఖ అధికారులు సన్మానం







**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 28 :** తిరుపతి రవాణా శాఖ అధికారి కార్యాలయంలో అమెరికాలో మూడు శాఖలకు మంత్రిగా పనిచేస్తూ 24 జిల్లాల కమిషనర్ గా ఉంటూ స్వగ్రామానికి విచ్చేసిన శ్రీ లంకెల బద్రీనాథ్ రవాణా శాఖ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా వారికి రవాణాశాఖ అధికారులు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా లంకెల బద్రీనాథ్ మాట్లాడుతూ తాను ట్రాన్స్పోర్ట్ ఇంజనీరింగ్ లో స్పెషలైజేషన్ అని తెలియజేస్తూ రవాణా శాఖ విధివిధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. రహదారులన్నీ రవాణా శాఖ పరిధిలో ఉన్నవా లేవా అనే అంశం మీద కూడా చర్చించారు. రవాణా శాఖ, జాతీయ రహదారులు , పోలీస్ శాఖ వారు మరియు స్థానిక మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేస్తే రహదాల నిర్మాణంలో నూతన అంశాల ప్రతిపాదన చేసేదానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. గతంలో ఉన్న రహదారుల కంటే చాలా మెరుగైన రహదారుల నిర్మాణం ప్రస్తుతం కనిపిస్తోందని అమెరికా మంత్రి లంకెల బద్రీనాథ్ హర్షం వ్యక్తం పరిచారు. ఈ సందర్భంగా తిరుపతి రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ స్థానికంగా రవాణా శాఖ చేసే వాహన తనిఖీల గురించి విపులీకరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికా నాజ్ మరియు పరిపాలన అధికారులు విజయ్ కుమార్ విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 28 :** గిద్దలూరు మండలం, బుర్జుపల్లె తాండకు చెందిన బద్రి నాయక్ నీట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి కాకినాడ రంగరాయ్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించారు. ఈ సందర్భంగా గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలవా వేసి సన్మానించారు. ఎంబిబిఎస్ సీటు సాధించిన బద్రినాథ్ ను, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి హృదయపూర్వకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యశించి సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు జడ్పిటిసి సభ్యులు బుడతా మధుసూదన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, ముండ్లపాడు సర్పంచ్ కడియం శేషగిరి, రామకృష్ణ బుక్కే హంజు నాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గోన్నారు.

## అభివృద్ధి-సంక్షేమం టిడిపిదే.. మోసాలు వైసీపీదే..!




**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్టు 28 :** పుల్లలచెరువు మండలం చాపలమడుగు గ్రామంలో పుల్లలచెరువు సొసైటీ చైర్మన్‌గా పాతకోటి రామిరెడ్డి, మెంబర్లు నారు వెంకట రామిరెడ్డి, పసుపులేటి పెద్దకొండలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కి పూల మాలలతో టపాసులతో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన వైసీపీ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత యువతకు నామినేటెడ్ పోస్టులు కట్టబెడుతూ బాధ్యతలు ఇస్తోందని ఎరిక్షన్ బాబు తెలిపారు. యువకులు పదవుల్లో ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్వాసం ఉంచారని గుర్తుచేశారు.మన ప్రాంతంలో సాగునీటి కొరత తీవ్రంగా ఉందని, రైతులు వర్షాధారపడి పంటలు సాగు చేస్తున్నారని ఆయన అన్నారు. రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు సకాలంలో మంజూరు చేసి ఆర్థికంగా బలోపేతం చేయడం టిడిపి ధ్యేయమని చెప్పారు. సింగిల్ విండో సొసైటీలను రైతుల కోసం తీసుకొచ్చింది ఎన్టీఆర్ నేతృత్వంలోని టిడిపేనని గుర్తు చేశారు.

పెన్షన్ల పెంపులో నిజమైన చరిత్ర టిడిపిదేనని ఎరిక్షన్ బాబు స్పష్టం చేశారు. కాంగ్రెస్, వైసీపీ పెంచిన దానికంటే గణనీయంగా చంద్రబాబు గారు పెంచారని, నేడు ప్రతి అర్హుడు 4000 పెన్షన్ పొందుతున్నది చంద్రబాబు కృషి ఫలితమేనని చెప్పారు.

**వైసీపీ మోసాలు :** జగన్మోహన్ రెడ్డి హయాంలో అమలు కాని వాగ్దానాలను ప్రజలు గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.అన్నక్యాంటీన్ మూసేసింది వైసీపీ-మళ్లీ ప్రారంభించింది చంద్రబాబు. నిరుద్యోగ భృతి రద్దు చేసింది జగన్-తిరిగి అందజేస్తున్నది టిడిపి. ఇల్లు, గ్యాస్, తల్లికి వందనం-ఇవన్నీ చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే" అని ఎరిక్షన్ బాబు దుమ్మెత్తి పోశారు. ఎర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు వరకు రెండు కోట్లతో రోడ్లు నిర్మించడం, ఎస్సీ కాలనీల్లో కోటి రూపాయల రోడ్లు వేయడం, హాస్టల్స్, డిగ్రీ కాలేజీలు, జలజీవన మిషన్ వంటి అభివృద్ధి పనులు అన్నీ టిడిపి హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు.

## ప్రథమ గణనాథుని దర్శించుకున్న భక్తులు..

● హరిత వనంలో గణనాథుడు విహారం చూపరులను ఆకర్షిస్తున్న మండపం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఆగస్టు 28:** జీవీఎంసీ...91 వ వార్డు పరిధి గణేష్ నగర్ లో ప్రథమ గణనాథుడు పర్యావరణ ప్రేమికుడు పచ్చని వనంలో విహరిస్తున్న గణనాధుని చూసేందుకు భక్తులు పర్యావరణాన్ని కాపాడండి అంటూ చక్కని సందేశంతో నిర్మించిన మండపం పలువురి భక్తులను ఆకర్షిస్తుంది..గణేష్ నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని పెద్ద ఎత్తున స్థానికులు దర్శించుకున్నారు. ప్రథమ గణనాథుడు అవతారంలో ఎకో ఫ్రెండ్లీ గణనాథుడి విగ్రహం పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందనీ స్థానికులు అంటున్నారు. సుమారు 8 అడుగుల ఎత్తున గణనాథుడిని.11 రోజులపాటు నిత్య పూజలు నిర్వహించడం జరుగుతుందని దీపారాధన అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## ఏ.ఆర్. హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన జిల్లా ఎస్పీ



**అనకాపల్లి, పెన్ పవర్, ఆగస్టు 28 :** అనారోగ్యంతో మృతి చెందిన ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ వి.ఈశ్వరరావు కుటుంబానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆర్థిక సహాయం చేశారు. కుటుంబ యోగక్షేమాలు తెలుసుకొని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనకాపల్లి జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ వి.ఈశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, రూ.2 12వేలు 200లు ఆర్థిక సహాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ ఆర్థిక సాయం డెత్ రిలీఫ్ ఫండ్, కో–ఆపరేటివ్ థ్రిఫ్ట్ ఫండ్ మరియు మంత్లీ సబ్‌స్క్రిప్షన్ సంబంధించిన నగదు చెక్ ను దివంగత హెడ్ కానిస్టేబుల్ సతీమణి వి.పద్మకి ఎస్పీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యులను పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది కన్నుమూయడం బాధాకరమని పేర్కొంటూ, పోలీసు శాఖ పూర్తిగా అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

## వార్డ్ ప్రెసిడెంట్, సెక్రటరీలతో సమావేశమైన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు





**గోపాలపట్నం, పెన్ పవర్, ఆగస్టు 28 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గం, గోపాలపట్నం కార్యాలయంలో ఆర్థికంగా స్త్రీలను బలోపేతం చేస్తూ ఎదిగేలా కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ లో ఒకటైన స్త్రీ శక్తి పథకం కింద 2025 సెప్టెంబరు ఒకటి, సోమవారం మధ్యాహ్నం 2.గంలకు 90వ వార్డ్, ఎన్ఏడి కొత్త రోడ్, బస్ స్టాప్ నుండి మద్దిలపాలెం రూట్ నందు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో మహిళా కూటమి సభ్యులతో బహిరంగసభ నిర్వహించాడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంపై పశ్చిమ నియోజకవర్గ మహిళ నాయకులు మరియు వార్డ్ ప్రెసిడెంట్ సెక్రటరీలతో సమావేశం అయ్యారు.

# ఎవరి స్వలాభం కోసం ఈ హైడ్రో పవర్ ప్రాజెక్ట్..?

**అభివృద్ధి పేరుతో. గిరిజన ఆస్తులు కొల్లగొడితే చూస్తూ ఊరుకోం.ఆదివాసి గిరిజన సంఘం హుకుంపేట మండల కమిటి**





**పెన్ పవర్ హుకుంపేట ఆగస్టు 28.** అల్లు సీతారామ జిల్లా హుకుంపేట మండలం. మజ్జి వలస.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మించవద్దు ఆదివాసుల అడవి,భూమి,నీరు పర్యావరణము నాశనం చేయవద్దని

మజ్జివలసలో జరిగిన ఆదివాసీ గ్రామసభ గర్జన లో తీర్మానం చేశారు

అనంతగిరి మండలం పెదకోట, చిట్టంపాడు,గుజ్జెలి ప్రాంతంలో అదని, నవయుగ ప్రైవేటు కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని మజ్జి వలస ఆదివాసీ గ్రామ సభ గర్జన డిమాండ్ చేసింది

రాష్ట్ర ప్రభుత్వం భుర్జ పంచాయతీ మజ్జి వలస గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ఆగస్టు 28 తేదీన గ్రామ సభ ఏర్పాటు చెయ్యాలనీ నోటీస్ ఇచ్చింది.

భుర్జ పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణము జరిగితే 14 గ్రామంలో 5 వేల మంది ఆదివాసులు జలసమాధి అవుతున్నారనీ ఆగ్రహంతో పంచాయతీకి చెందిన వందలాది మంది ఆదివాసులు గ్రామసభకు హాజరయ్యారు

వందలాది మంది ఆదివాసులు ఆగ్రహాన్ని ప్రభుత్వం గమనించి మజ్జి వలసలో జరగవలసిన గ్రామ సభను తాత్కాలికంగా వాయిదా వేసింది మజ్జివలసలో జరిగిన ఆదివాసీ గర్జన గ్రామ సభ మరియు భారీ గర్జన ర్యాలీలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర మాట్లాడుతూ మాట్లాడుతూ

భుర్జ పంచాయతీలో 14 గ్రామ పరిధిలోని 5 వేల మంది ఆదివాసులు జలసమాధి చేస్తున్న హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు వేయాలనీ డిమాండ్ చేశారు

భుర్జ పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి నిర్మిస్తున్న సర్వే రాళ్ళు పగలుగొట్టాలని ఆదివాసులకు పిలుపిచ్చారు

ఆదివాసీలకు 5 వ షెడ్యూల్ ప్రాంతంలో రాజ్యాంగ హక్కులైన పీసా చట్టం, అటవి హక్కుల,1/70 చట్టన్నీ ఉల్లంఘించి ప్రైవేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి వేల ఎకరాల అటవి, జీరయితి భూములు కేటాయించడాన్ని తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా. డిమాండ్ చేశారు

అనంతరం.అనంతగిరి జడ్పీటీసీ డి.గంగరాజు మాట్లాడుతూ అనంతగిరి మండలంలో పెదకోట, గుజ్జెలి, చిట్టంపాడు ప్రాంతంలో నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివో 51 రద్దు చేయాలని డిమాండ్ చేశారు

ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పీ బలదేవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అదానీ,నవయుగ సంస్థకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి అనుమతులు ఇచ్చి గుట్టు చప్పుడు లేకుండా గ్రామంలో సర్వేలు, ముమ్మరం చేసింది మార్కింగ్ రాళ్ళు నిర్మిస్తున్నది తక్షణమే సర్వేలు,మార్కింగ్ రాళ్ళు నిర్మినాలు ఆపాలని డిమాండ్ చేశారు



ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం హుకుంపేట మండల కార్యదర్శి టీ.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భుర్జ పంచాయతీ ఎంపీటీసీ మజ్జి హరి,చర్పంచ్ కె. మొత్తి,ఉప సర్పచ్ లక్ష్మి,పిసా అధ్యక్ష విజయకుమార్. కార్యదర్శులు ప్రసాదు సురేష్ కుమార్,పరుశురాం,పంగి హరి,సొనపటి వార్డు నెంబర్ గాసన్న వరునకుమర్ బాలరాజు హుకుంపేట మండల సిపిఎం పార్టీ కార్యదర్శి వి.లక్మన్, గిరిజన సంఘం మండల నాయకులు కె. రామారావు,అనంతగిరి మండలం టోకురు పంచాయతీ చర్పంచ్ కిల్లో మోసియా మజ్జి వలస యువత కృష్ణం రాజు తోపాటు వివిధ గ్రామాలకు చెందిన గిరిజన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ని కలిసిన బెహరా భాస్కరరావు

**ఎన్ఏడి, పెన్ పవర్, ఆగస్టు 28 :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కల్యాణ్ ని జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు విశాఖపట్నం విమానాశ్రయములో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు.





● మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి


● ఈగల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ విజయ కుమార్

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, ఆగస్టు 28.** :విజయనగరం ఈగల్ బృందం ఆధ్వర్యంలో ఆగస్టు 28 న తోటపాలెం లో గల ఎస్.ఎస్. ఎస్.ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాల పట్ల అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈగల్ హెచ్సీ విజయ కుమార్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు భవిష్యత్తుకు అనర్థదాయకమన్నారు. ఒకసారి మత్తు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ఆయా అలవాట్ల నుండి బయటపడడం కష్టమ ని అన్నారు. ఒకసారి మాదక ద్రవ్యాలను వినియోగిస్తే కొద్ది రోజుల్లోనే వాటికి బానిసలు గా మారుతున్నారన్నారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టుకోవాలని, లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. చెడు అలవాట్లతో భవిష్య త్తు నాశనం చేసుకోవద్దన్నారు. ప్రాథమిక స్థాయి లో మాదక ద్రవ్యాల వినియోగించే అలవాటు ఉంటే డీ–అడిక్షన్ సెంటర్స్ లో అందించే చికిత్స ద్వారా స్వస్థత పొందవచ్చునన్నారు. కావున, యువత, విద్యార్థులు భవిష్యత్తు పై శ్రద్ధ పెట్టా లని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. గంజాయి, మత్తుపదా ర్థాలు గురుంచి ఏదైనా సమాచారం తెలిస్తే స్థాని క పోలీసు స్టేషన్ కి గాని, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీమ్ సభ్యులు, ఎస్. ఎస్.ఎస్.ఎస్ డిగ్రీ కళాశాల లెక్చరర్స్, విద్యా ర్థులు పాల్గొన్నారు.

# నియోజవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధానమైన ధ్యేయం.. రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు :పల్లా

**గాజువాక :పెన్ పవర్, ఆగస్టు 28:** మహావిశాఖ నగరపాలక సంస్థ 66వార్డు వార్డులో జీవీఎంసీ నిధులు సుమారు రెండు కోట్ల ఎనభై లక్షలు తో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అజిమాబాద్ సున్ని జామా మసీదు వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు . శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ 66వ వార్డులో సీసీ రోడ్లు సిసి డ్రైనేజీ అలాగే సీసీ కల్వట్లకు రెండు కోట్ల 85 లక్షలతో వర్కులు పెట్టడం జరిగిందని అలాగే గాజువాకలో అతి పురాతనమైన అజిమాబాద్ సున్ని జామా మసీదు పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి తో మాట్లాడి ప్రత్యేకమైన నిధులు తీసుకొస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఇవే కాకుండా 66 వార్డులో ఇంకేమైనా పనులు పెండింగ్లో ఉంటే అవి కూడా శాసనసభ్యుడు దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో 66 వార్డ్ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ 66 వార్డ్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ మరియు వార్డు అధ్యక్షుడు గోమాడవాసు వార్డు కార్యదర్శి ఎండి ముర్తజ వార్డు మైనార్టీ నాయకులు అన్సర్ వల్లి మోతి చెరుకూరి నాగేశ్వరరావు వార్డు కార్యదర్శి సాయిరాం లక్ష్మణరావు బుజ్జి లతా మున్వర్ అన్వర్ ఇమామ్ మౌలాలి మదిన వల్లి ఖాన్, జి సత్యనారాయణ పవన్ కుమార్ ,రమణ, మిశ్రా జీవీఎంసీ డిఈ ,ఏఈ పాల్గొన్నారు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.





# భారత్ పై ట్రంప్ సుంకాల వెనుక అసలు కారణం అదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో భారత ఎగుమతులపై 50 శాతం వరకు సుంకాలు విధింపబడ్డాయి. ఈ చర్య ఒకే ప్రశ్నను రేకెత్తిస్తోంది. ఇది నిజంగా రష్యా చమురు కారణంగానా? లేక భారత్‌పై వ్యూహాత్మక ఒత్తిడా? అన్నది తేలాల్సి ఉంది. నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్‌కాంత్ సూటిగా చెప్పినట్లే, ఈ టారిఫ్‌లకు రష్యా చమురుతో సంబంధం లేదని స్పష్టమవుతోంది. రష్యా చమురుకు అతిపెద్ద కొనుగోలుదారు చైనా. యూరప్ కూడా రష్యా ఇంధనంపై బాగా ఆధారపడి ఉంది. అయినా ఎందుకు భారత్‌పైనే కఠిన సుంకాలు? అమెరికా తన “మిత్రదేశం”పై ఇంత కఠినంగా వ్యవహరించడం సహజంగానే సందేహాలను రేకెత్తిస్తోంది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇప్పటికే స్పష్టంచేశారు. రష్యా నుంచి అత్యధిక దిగుమతులు భారత్ కాదని, చైనా, యూరప్ అని. అంతేకాదు, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాలని అమెరికానే సూచించిందని ఆయన గుర్తుచేశారు. అయినా ఇప్పుడు అదే విషయాన్ని ఆయుధంలా ఉపయోగించి భారత్‌పై సుంకాల మోత మోగించడం తార్కికతను కోల్పోయిన నిర్ణయమే.

**భారత్‌కు మేల్కొలుపు**

ఈ పరిస్థితిని ఓ మేల్కొలుపుగా తీసుకోవాలని అమితాబ్‌కాంత్ పిలుపు గమనార్హం. నిజమే భారత్ తన ఇంధన భద్రత, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిపై రాజీపడలేదు. అంతర్జాతీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటూ వచ్చిన దేశం మనది. ఈసారి కూడా అదే ధైర్యంతో నిలబడాల్సిన అవసరం ఉంది.


**వాణిజ్యంపై ప్రభావం**

సుమారు 48 బిలియన్ డాలర్ల ఎగుమతులపై నేరుగా ప్రభావం చూపే ఈ సుంకాలు తాత్కాలికంగా మన ఆర్థిక వ్యవస్థకు భారమవుతాయి. వాణిజ్య రంగం ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా ఉత్పత్తులపై ప్రతీకార సుంకాల విధానం పరిగణనలోకి తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి. ఇది సమంజసమే. ఎందుకంటే, ఏకపక్ష చర్యలకు ఎదురు ప్రతిస్పందన అవసరం.

**ముందున్న సవాలు.. అవకాశం కూడా..**

ప్రపంచ వాణిజ్యంలో అమెరికా చూపుతున్న ద్వంద్వ వైఖరి భారత్‌ను కొత్త దారుల వైపు నడిపే అవకాశముంది. సుంకాల దెబ్బ మనకు ఇబ్బందే అయినా అదే సంస్కరణలకు, కొత్త వాణిజ్య భాగస్వామ్యాల అన్వేషణకు కారణమవ్వాలి. మొత్తం మీద ట్రంప్ టారిఫ్‌లు కేవలం రష్యా చమురు కారణం కాదని స్పష్టమవుతోంది. ఇవి భారత్‌పై వ్యూహాత్మక ఒత్తిడికి మరో రూపం. ఇలాంటి సందర్భాల్లో భారత్ వెనకడుగు వేయకుండా తన స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటూ ముందుకు సాగాల్సిందే.

# బుద్ధిపోనిచ్చుకోని చైనా.. పాక్ కు ఆహ్వానం.. మోడీకి లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజింగ్‌లో జరగనున్న చైనా 80వ విక్టరీ పరేడ్ చుట్టూ ఇప్పటికే రాజకీయ చర్చలు రగులుతున్నాయి. జపాన్‌పై సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ చైనా ప్రతీ ఏటా నిర్వహించే ఈ వేడుకలకు ఈసారి మరింత ఆర్భాటంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 3, 2025న జరిగే ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వాన పత్రాలు పంపించారు.

**పాక్ ప్రధానికి ఆహ్వానం.. భారత్‌కు నిరాకరణ**

చైనా ఆహ్వానించిన 26 దేశాధినేతల జాబితాలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రత్యేకంగా ప్రస్తావన పొందారు. అంతేకాదు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు తదితర నేతలు కూడా ఈ వేడుకలకు హాజరుకానున్నారు. అయితే ఆశ్చర్యకరంగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం అందలేదు. దీంతో ఈ ఘన వేడుకలో భారత్ ప్రాతినిధ్యం ఉండకపోవడం ఖాయమైంది.

**SCO సదస్సుకు మోదీ హాజరు**

ఇదే సమయంలో అదే వారం చైనాలో జరగనున్న షాంఘై సహకార సంస్థ ) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగే ఈ సమావేశం SCO చరిత్రలోనే అతిపెద్దదిగా ఉండనుందని చైనా ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా 20 దేశాల నేతలు ఈ సదస్సులో హాజరవుతారు.

**భారత్ – చైనా సంబంధాల నేపథ్యం**

గత కొన్ని ఏళ్లుగా భారత్ – చైనా సంబంధాలు గట్టిగా పరీక్షకు గురవుతున్నాయి. 2018లో మోదీ చివరిసారి చైనాను సందర్శించారు. ఆ తర్వాత జిన్‌పింగ్ భారత్ పర్యటించారు. కానీ 2020లో లద్దాఖ్ గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో ఇరు దేశాల సైనికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనతో సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

**అమెరికా సుంకాలతో కొత్త మలుపు**

ఇక మరోవైపు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా నిర్ణయం కూడా చర్చనీయాంశమైంది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోందని కారణంగా భారత్ వస్తువులపై 50 శాతం టారిఫ్ విధించారు. ఆగస్టు 27 నుంచి అమలులోకి వచ్చిన ఈ నిర్ణయం, భారత్ నుంచి అమెరికాకు జరిగే 48 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం చూపనుంది.

**రాబోయే రోజుల్లో అంతర్జాతీయ సమీకరణలు**

ఈ పరిణామాల నేపథ్యంలో చైనాలో జరగనున్న %ాజూ% సమావేశంపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. అమెరికా వైఖరిపై పలు దేశాలు వ్యతిరేకంగా స్పందించే అవకాశముంది. చైనా%–%పాక్ సాన్నిహిత్యం, భారత్‌కు ఎదురవుతున్న ఆర్థిక%–%దౌత్యపరమైన సవాళ్లు రాబోయే కాలంలో అంతర్జాతీయ రాజకీయాలపై పెద్ద ప్రభావం చూపనివి కావు.

మొత్తం మీద చైనా విక్టరీ పరేడ్‌లో పాక్ ప్రధానికి ఆహ్వానం ఇవ్వడం, మోదీని పక్కన పెట్టడం వెనుక ఉన్న రాజకీయ సంకేతాలపై ప్రపంచ దృష్టి పడింది.

# రాహుల్ చేతిలో మరో బాంబు...పేల్చేది అపుడేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగస్టు నెలలో అతి పెద్ద రాజకీయ సంచలనానికి కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తెర తీశారు. ఏకంగా కేంద్ర ఎన్నికల సంఘం మీద తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి ఆయన పెట్టిన పేరు ఓటు చోరీ. బీజేపీకి ఈసీ ఎన్నికల్లో సాయం చేస్తోంది అని ఆయన తన దగ్గర ఉన్న ఆధారాలను అన్నింటినీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించే ప్రయత్నం చేశారు. దాంతో ఒక్కసారిగా దేశంలోనే కలకలం రేగింది. ఓట్ల చోరీ అంటూ రాహుల్ అందుకున్న నినాదం మీద మేధావులు ఇతర వర్గాలు చదువరులలో సైతం ఆలోచనలు రేకెత్తించాయి. సరి కొత్త చర్చలు అయితే అంతటా మొదలయ్యాయి.

**అదే ఊపుతో అలా**

ఇక చూస్తే కనుక ఆగస్ట్ 7న ఢిల్లీ వేదికగా మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఓట్ల చోరీ మీద ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ తరువాత ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. పార్లమెంట్ ఒక వైపు జరుగుతూంటే ఎంపీలతో కలసి ఆయన ఈసీ కార్యాలయం దాకా ప్రదర్శన నిర్వహించారు అదే ఊపులో ఆయన బీహార్ రాష్ట్రమంతా ఓటర్ అధికార్ యాత్రను చేపట్టారు. దానికి జనంలో మంచి స్పందన లభిస్తోంది. ఆయన దాదాపుగా ప్రతీ రోజూ ప్రతీ సభలోనూ ఈసీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కలిపి ఎండగడుతున్నారు ఓట్ల చోరీ జరిగింది అన్నది అంతా నమ్ముతున్నారని కూడా అంటున్నారు

**మరో బాంబు రెడీనా**

ఇదిలా ఉంటే ఇదే స్పీడ్ లో రాహుల్ గాంధీ బీహార్ నుంచి ఒక సంచలన ప్రకటన చేశారు. ఓట్ల చోరీ పెద్ద ఎత్తున జరిగిందని నిరూపిస్తాను అని కూడా రాహుల్ గాంధీ గర్జిస్తున్నారు. ఒక్క బీహార్ లోనే ఏకంగా 65 లక్షల ఓటర్ల పేర్లు లేకుండా పోయాయని రాహుల్ ఆరోపించారు బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘం కలసి ఈ విధంగా ఓట్లు తొలగించారని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలా ఓట్లు పోగొట్టుకున్న వారిలో ఎక్కువగా బాధితులుగా ఉన్నది బడుగు బలహీన వర్గాలవారేనని రాహుల్ అంటున్నారు.

**మరిన్ని ఆధారాలున్నాయి :**

ఓట్ల చోరీ జరిగింది అనడానికి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని రాహుల్ గాంధీ అంటున్నారు. రానున్న రోజులలో 2024 లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ ఏ విధంగా జరిగింది అన్నది కూడా వివరిస్తాను అని ఆయన చెప్పడం విశేషం. ఇప్పటిదాకా కర్ణాటక హర్యానా, మహారాష్ట్రలలో ఓట్ల చోరీ జరిగింది అని మాత్రమే చెబుతూ వచ్చిన రాహుల్ గాంధీ ఇపుడు దేశవ్యాప్తంగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో సైతం ఓట్లు గల్లంతు అయ్యాయని వాటి పూర్తి సమాచారం తన దగ్గర ఉందని అంటున్నారు.

**మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ :**

ఇదిలా ఉంటే ప్రస్తుతం రాహుల్ గాంధీ ఓటర్ అధికార యాత్ర పేరుతో బీహార్ లో యాత్ర నిరహిస్తున్నారు. అది ఈ నెల 17న ప్రారంభం అయింది. ఈ నెల చివరి దాకా కొనసాగుతుంది. సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే బహిరంగ సభతో ఈ యాత్ర ముగుస్తుంది ఆ తరువాత రాహుల్ గాంధీ లోక్ సభ ఎన్నికల్లో జరిగిన ఓట్ల చోరీ గురించి మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వబోతున్నారు అని అంటున్నారు. ఇప్పటికే ఓట్ల చోరీ ఆరోపణల మీద ఈసీ వివరణ ఇచ్చినప్పటికీ అది ఏ మాత్రం సరిపోవడం లేదు రాహుల్ గాంధీ జనంలోకి వెళ్తున్నారు వారి మధ్యనే అంతా చర్చకు పెడుతున్నారు. జనాల నుంచి వస్తున్న ఆదరణతో మరింత సమాచారం ఉందని అంటున్నారు రాహుల్ గాంధీ మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ తో ఎన్ని సంచలనాలు దేశ రాజకీయాల్లో నమోదు అవుతాయో అన్న చర్చకు తెర లేస్తోంది.

# వర్షం చెప్పిన అసలు కథ: రోడ్డెక్కిన కండోలిమ్‌లు.. ప్రజల్లో కలకలం!



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు పట్టణాల్లో రహదారులు చెరువుల్లా మారగా, గుంటూరులో మాత్రం వర్షం ఒక వింత దృశ్యాన్ని బయటపెట్టింది.

**అరండల్‌పేట రహదారులపై విచిత్ర దృశ్యం**

గుంటూరు నగరంలోని ఎప్పుడూ రద్దీగా ఉండే అరండల్‌పేట రోడ్డుపై వర్షపు నీటితో పాటు అనుకోకుండా పెద్ద సంఖ్యలో కండోలిమ్‌లు కొట్టుకువచ్చి పడటంతో స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. రహదారులపై వాటిని చూసిన ప్రజలు తీవ్ర అసహనానికి గురై చీదరించారు. వినాయక చవితి సందర్భంగా మండపాలకు వచ్చే భక్తులు కూడా ఆ దృశ్యాన్ని చూసి విస్మయం వ్యక్తం చేశారు.

**లాడ్జి నుంచి బయటకు వచ్చినవేనా?**

ఆ కండోలిమ్‌లు ఒక లాడ్జి ముందు రోడ్డు మీద కనిపించడంతో ఆ లాడ్జిలో అసలు ఏం జరుగుతుంది అన్న అనుమానాలు ప్రజల్లో మొదలయ్యాయి. వర్షం నీటితో అవి బయటకు కొట్టుకువచ్చి రహదారిపైకి చేరినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనితో ఆ లాడ్జి కార్యకలాపాలపై అనుమానాలు ముదురుతున్నాయి.

**ప్రజల ప్రశ్నలు – పోలీసుల మౌనం**

నగర నడిబొడ్డులో ఇలాంటి దృశ్యం కనబడుతుంటే పోలీసులు ఏమి చేస్తున్నారు

అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లాడ్జి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్లపై కండోలిమ్‌లు కొట్టుకువచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో, ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**వర్షం చెప్పిన కథ**

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా రహదారులు మునిగిపోయాయి. కానీ ఈ వర్షం గుంటూరులోని ఒక లాడ్జి రహస్యాలను కూడా అందరికీ బహిర్గతం చేసింది. ఇకనైనా సంబంధిత అధికారులు మేల్కొని ఆ లాడ్జిపై విచారణ జరిపి,

# డేటింగ్ యాప్.. వీళ్లు మామూలు ముదుర్లు కాదండోయ్!

**హైదరాబాద్ పెన్ పవర్:** అప్డేట్ అవుతున్న జనరేషన్లో చాలామంది మహిళలు, పురుషులు డేటింగ్ యాప్ లను వాడుతున్నారు. ఈ డేటింగ్ యాప్ ద్వారా తమ అభిరుచులకు సెట్ అయిన పురుషుడిని గానీ మహిళను గానీ ఎంచుకొని కొన్ని రోజులు డేటింగ్ చేసి పెళ్లిళ్లు చేసుకోవడం చేస్తున్నారు. ఇక మరికొన్ని మ్యాట్రిమోనీ యాప్ లలో ప్రొఫైల్స్ క్రియేట్ చేసుకుని పర్ఫెక్ట్ జోడి కోసం వెతుక్కుంటున్నారు. అయితే తాజాగా డేటింగ్ యాప్ లకు సంబంధించి ఒక సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే డేటింగ్ యాప్ లను మగవాళ్ళ కంటే ఎక్కువగా ఆడవారే యూస్ చేస్తున్నారట. అవును మీరు వినేది నిజమే.. తాజాగా ఒక ప్రముఖ డేటింగ్ యాప్ సిఈఓ ఈ విషయాన్ని బయటపెట్టారు. మరి ఇంతకీ ఆయన చెప్పిన విషయంలో ఉన్నది ఎంత నిజం అనేది ఇప్పుడు తెలుసుకుందాం..

సాధారణంగా ఇంట్లో మహిళలకు కట్టుబాట్లు అనేవి ఉంటాయి. ఇంట్లో నుంచి బయటికి వెళ్తే ఏ టైంకి రావాలి.. ఎవరెవరితో ఉండాలి అనేది ఇంట్లో అమ్మా, నాన్న, అన్న, భర్త ఇలా ఎవరో ఒకరు కండిషన్ పెడుతూ ఉంటారు. కానీ ఇప్పటి జనరేషన్ చాలా మారిపోయింది. అమ్మాయిలు కూడా పురుషుల లాగే అన్ని రంగాలలో రాణిస్తున్నారు. అలా అబ్బాయిలతో సరి సమానంగా ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అయితే అన్ని రంగాల్లో లాగే ఈ డేటింగ్ యాప్ లలో కూడా మగాళ్లకు మేము ఏమాత్రం తీసిపోము అంటున్నారు అమ్మాయిలు. ఎందుకంటే తాజాగా ఒక ప్రముఖ డేటింగ్ యాప్ వాళ్లు తమ డేటింగ్ యాప్ లో మగవాళ్ళ కంటే మహిళ యూజర్ లే ఎక్కువగా ఉన్నారంటూ తేల్చేశారు.




తాజాగా Knot డేటింగ్ యాప్ సీఈఓ అయినటువంటి జస్వీర్ సింగ్ డేటింగ్ యాపుల్లో మహిళా యూజర్ లే ఎక్కువ ఉన్నారని, మగవాళ్ళు తక్కువగా ఉన్నారని తెలియజేశారు. జస్వీర్ సింగ్ మాట్లాడుతూ..Knot డేటింగ్ యాప్ లో 57% మహిళ సబ్స్క్రైబర్లు ఉన్నారు అంటూ తెలియజేశారు.ఇక 57% మహిళా సబ్స్క్రైబర్లు ఉంటే మిగిలిన 43% మంది పురుష యూజర్లు ఉన్నారన్నమాట. అలా వాళ్ళ డేటింగ్ యాప్ లో మగవాళ్ళ కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారని ఆయన తెలియజేశారు. అంతే కాదు మా డేటింగ్ యాప్ లో ఆరు నెలల సబ్స్క్రిప్షన్ కోసం 57,459 రూపాయల ఫీజు పెట్టినా కూడా మహిళ యూజర్లు వెనకడుగు వేయడం లేదు. మగవాళ్ళ కంటే వీళ్లే ఎక్కువ డబ్బులు చెల్లించి సబ్స్క్రైబ్ చేసుకుంటున్నారు అంటూ సంచలన విషయం బయటపెట్టారు. ప్రస్తుతం Knot డేటింగ్ యాప్ సీఈవో చెప్పిన ఈ విషయం విన్న చాలామంది నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు కలికాలం అంటూ మరి కొంతమంది మగవాళ్లు కామెంట్స్ పెడుతున్నారు. ఇక అమ్మాయిలేమో మగవాళ్ళ కంటే అమ్మాయిలు ఏ విషయంలో కూడా తీసిపోరు అని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఆన్లైన్లో టిండర్,బంబుల్, గ్రిండర్, Knot వంటి ప్రముఖ డేటింగ్ యాప్ లు ఉన్నాయి. డేటింగ్ యాప్ ల వల్ల చాలామంది అభిప్రాయాలు కలిసి పెళ్లిళ్లు చేసుకున్న వారు ఉన్నారు. మరి కొంతమంది పెళ్లిళ్లు కాకుండా డేటింగ్ లు చేసి నచ్చకపోతే బ్రేకప్ చెప్పుకున్న వాళ్ళు కూడా ఉన్నారు.

# పవర్ హిట్టర్స్, యార్కర్ల వీరులకు పండగే..
## ఇంగ్లాండ్ దిగ్గజ క్రికెటర్ రెండు కొత్త రూల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మెన్స్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఇటీవలే చాలా కొత్త రూల్స్ ప్రకటించింది. టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్, లాలాజల నియమంలో మార్పు, DRS విధానంలో కొత్త మార్పు, షార్ట్ రన్ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. క్రికెట్ ను మరింత ఆసక్తికరంగా మార్చడానికి ఇంగ్లాండ్ దిగ్గజ క్రికెటర్.. మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ క్రికెట్ లో రెండు సరికొత్త రూల్స్ ను ప్రతిపాదించాడు. పవర్ ఫుల్ హిట్టర్లకు ఈ రూల్ ఊరించేలా చేస్తుంది. మరోవైపు యార్కర్లు వేసే బౌలర్లకు ఈ రూల్ అనుకూలంగా ఉంది.

### 100 మీటర్లు కొడితే 12 పరుగులు:

పీటర్సన్ మాట్లాడుతూ.. " నేను ఇంతకు ముందే చెప్పాను. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాను. ఒక బ్యాటర్ కొట్టిన సిక్సర్ 100 మీటర్లు దాటితే జట్టుకు ఆరు పరుగులు కాకుండా 12 పరుగులు ఇవ్వాలి. ఈ రూల్ పెడితే బ్యాటర్లు భారీ సిక్సర్లు కొట్టడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు క్రికెట్ ఫ్యాన్స్ కు ఎక్కువ ఎంటర్ టైన్ లభిస్తుంది". అని ఈ ఇంగ్లాండ్ క్రికెటర్ అన్నాడు. క్రికెట్ లో 100 మీటర్ల సిక్సర్లు చాలా అరుదుగా కొడుతూ ఉంటారు. పీటర్సన్ రూల్ పై భిన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. క్రికెట్ లో బేసిక్ రూల్స్ ను మార్చడమేంటి అంటూ కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారు.

### మిడిల్ స్టంప్ కు బాల్ తగిలితే నెక్స్ట్ బ్యాటర్ ఔట్:

"ఒక బౌలర్ మిడిల్ స్టంప్‌ను పడగొట్టి వికెట్ తీస్తే నెక్స్ట్ వచ్చే బ్యాటర్ కూడా ఔట్ గా ప్రకటించాలి. దీని వలన బౌలర్లు ఎక్కువగా యార్కర్లు వేయడంపై దృష్టి పెడతారు". అని అన్నాడు. పీటర్సన్ చెప్పిన దాన్ని బట్టి చూస్తే బౌలర్ మిడిల్ స్టంపు ను పడగొడితే రెండు వికెట్లు తీసినట్టే. ఈ రూల్ పాయ్ కూడా నెటిజన్స్ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. టెస్టు క్రికెట్ లో అద్భుతమైన బ్యాటర్ గా పేరు తెచ్చుకున్న పీటర్సన్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో మెంటార్ గా ఉన్నాడు.

# లాకీ ఫెర్గూసన్ ఆల్ టైమ్ టాప్-5 టెస్ట్ బౌలర్లు వీరే..
## టీమిండియా పేసర్లకు నో ఛాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ క్రికెట్ లో ఎంతో మంది ఫాస్ట్ బౌలర్లు తమదైన ముద్ర వేశారు. కొంతమంది స్వింగ్ తో బోల్తా కొట్టిస్తే మరి కొంతమంది తమ వేగంతో బయపెట్టేవారు. మరికొందరైతే బౌన్సర్లతో బ్యాటర్లకు చుక్కలు చూపించేవారు. వీరందరికి డిఫరెంట్ గా యార్కర్లతో ఇబ్బంది పెట్టే పేసర్లు ఉన్నారు. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ తన ఆల్ టైమ్ టాప్-5 టెస్ట్ బౌలర్ల వ్యక్తిగత లిస్ట్ ను షేర్ చేశాడు. వీరిలో ఒక్కరు కూడా ఇండియన్ పేసర్ లేదు. క్రిక్‌ట్రాకర్‌కు ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలో పాకిస్తాన్ నుండి ఇద్దరు దిగ్గజాలుకు చోటివ్వగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లలో ఒకొక్కరికి ఛాన్స్ ఇచ్చాడు. వారెవరో ఇప్పుడు చూద్దాం..

**షేన్ బాండ్ (న్యూజిలాండ్): ఖ**
కెరీర్ ప్రారంభంలో ఫ్యూచర్ స్టార్ బౌలర్ గా కితాబులు అందుకున్న షేన్ బాండ్ కెరీర్ గాయాల కారణంగా స్వల్ప కాలానికే పరిమితమైంది. టెస్ట్ కెరీర్‌లో కేవలం 18 మ్యాచ్‌ల్లో 87 వికెట్లతో తన సుదీర్ఘ ఫార్మాట్ కెరీర్ ను ముగించాడు. యావరేజ్ 22.09 కాగా స్ట్రైక్ రేట్ 38.76 ఉంది. షేన్ బాండ్ స్ట్రైక్ రేట్ (కనీసం 2,500 బంతులు) లో ఆల్-టైమ్ బౌలర్ల జాబితాలో రెండో స్థానంలో ఉండడం విశేషం. బాండ్ ఫిట్ గా ఉన్న సమయంలో తన వేగంతో బ్యాటర్లకు చుక్కలు చూపించేవాడు.

**మిచెల్ జాన్సన్ (ఆస్ట్రేలియా):**
ఆస్ట్రేలియాకు లెఫ్టర్మ్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ జాన్సన్ ఈ లిస్ట్ లో రెండో స్థానంలో ఉన్నాడు. 2010 దశాబ్దంలో జాన్సన్ టాప్ బౌలర్. అతని బౌన్సర్లతో బ్యాటర్లను ఇబ్బందిపెట్టేవాడు. ఓవరాల్ గా జాన్సన్ తన టెస్ట్ కెరీర్ లో 28.40 సగటుతో 313 టెస్ట్ వికెట్లను పడగొట్టాడు. వీటిలో 12 సార్లు ఐదు వికెట్ల ఘనతలు ఉన్నాయి. 2013-14 యాషెస్ సిరీస్‌లో విశ్వరూపమే చూపించాడు. ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో 37 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు.

**షోయబ్ అక్తర్ (పాకిస్తాన్):**
'రావల్పిండి ఎక్స్‌ప్రెస్' అని పిలువబడే షోయబ్ అక్తర్ ను ఫెర్గూసన్ తన టెస్ట్ బెస్ట్ బౌలర్ల జాబితాలో చోటిచ్చాడు. ఎక్స్‌ప్రెస్ వేగంతో బౌలింగ్ చేస్తూ బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టిన అక్తర్ బౌలింగ్ ఆడడం అప్పట్లో ఒక ఛాలెంజ్. క్రికెట్ చరిత్రలో 161.3 కి.మీ/గం వేగంతో వేగవంతమైన డెలివరీ రికార్డు సైతం ఈ పాక్ బౌలర్ పేరిట ఉండడం విశేషం. ఓవరాల్ టెస్ట్ కెరీర్ విషయానికి వస్తే 46 టెస్టులలో 25.69 సగటుతో 178 వికెట్లు పడగొట్టాడు.

**వసీం అక్రమ్ (పాకిస్తాన్):**
ఫెర్గుసన్ జాబితాలో చేరిన మరో బెస్ట్ బౌలర్ పాకిస్తాన్ పేసర్ వసీం అక్రమ్. క్రికెట్ చరిత్రలో గ్రేటెస్ట్ లెఫ్ట్ హ్యాండర్ బౌలర్ గా అక్రమ్ కు పేరుంది. ఓ వైపు వేగంగా బంతులు వేస్తూనే బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగలడు. బాల్ ను రివర్స్ స్వింగ్ చేయడంలో తనకు తానే సాటి. 90 వ దశకంలో అక్రమ్ బౌలింగ్ ను ఎదుర్కోవడం బ్యాటర్లకు ఒక పీడకల. తన టెస్ట్ కెరీర్ లో ఓవరాల్ గా 104 మ్యాచ్‌ల్లో 23.62 సగటుతో 414 వికెట్లను అక్రమ్ తన ఖాతాలో వేసుకున్నాడు. వీటిలో 25 ఐదు వికెట్ల ఘనతలు ఉన్నాయి. 'సుల్తాన్ ఆఫ్ స్వింగ్' గా పేరు తెచ్చుకున్న అక్రమ్ వన్డేల్లో 500 వికెట్లను పడగొట్టిన ఏకైక బౌలర్.

**కర్ట్లీ ఆంబ్రోస్ (వెస్టిండీస్):**
వెస్ట్ ఇండియన్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ కర్ట్లీ ఆంబ్రోస్ కు ఫెర్గూసన్ తన లిస్ట్ లో చోటు కల్పించాడు. ఆరడుగుల ఆంబ్రోస్ బౌన్సర్లను ఎదర్కోవడం 1980ల్లో బ్యాటర్లకు అతి పెద్ద పరీక్షగా మారింది. 1990 దశాబ్దంలో కూడా ప్రపంచ క్రికెట్ లో తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. అంబ్రోస్ టెస్ట్ కెరీర్ విషయానికి వస్తే ఓవరాల్ గా 98 మ్యాచ్‌ల్లో 20.99 సగటుతో 405 టెస్ట్ వికెట్లు పడగొట్టాడు. వీటిలో 22 సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. 1993లో ఆస్ట్రేలియాపై 1 పరుగుకు 7 వికెట్లు తీసి మైండ్ బ్లోయింగ్ స్పెల్ వేశాడు.

# నేను ఫోటోలు తీసేవాళ్లను నమ్మను.. నటి ఫికర్!



నేను ఫోటోలు తీసేవాళ్లను నమ్మను.. కొన్ని ఫోటోలను తీసి ఉద్దేశపూర్వకంగా వాటిని జూమ్ చేయడం ద్వారా సంచలనాలను సృష్టించాలని అనుకుంటారు%--% అని అన్నారు కృతి సనోన్. తాను పొట్టి దుస్తుల్లో ఉన్నప్పుడు ఫోటోగ్రాపర్లు తనను రకరకాల కోణాల్లో ఫోటోలు తీసేందుకు ఆరాటపడతారని, కానీ తాను వేదికలపైకి వెళ్లినప్పుడు తన సహచరులను తనకు ముందుగా నిలబడాలని రెక్వెస్ట్ చేస్తానని కూడా కృతి చెప్పింది. వారు చూసే కోణం తప్పుడు కోణం.. ఉద్దేశపూర్వకంగా అలాంటి ఫోటోలు తీస్తారు! అని కూడా కృతి అన్నారు. సినీరంగంలో ఎదగాలనుకున్న నటీమణులకు ఇలాంటి వ్యక్తుల వల్ల సమస్యలు తలెత్తుతాయని కూడా తెలిపారు. అయితే సెలబ్రిటీల గోప్యతను కాపాడే విషయంలో హాలీవుడ్ మీడియా పద్ధతిగా ఉంటుందని కూడా కృతి కితాబిచ్చింది. ఓసారి ప్రియాంక చోప్రా గౌన్ వేదికపైనే జారిపోతుండగా, ఆ సమయంలో తన గౌరవాన్ని కాపాడుతూ అంతర్జాతీయ మీడియా దానిని షూట్ చేయలేదని చెప్పింది. కానీ భారతీయ మీడియా అలా కాదు. శరీర అందాలను హైలైట్ చేయాలని తహతహలాడుతుంది. వీటిని మీడియాలు స్పెషల్ స్టోరీలుగా వేస్తారు. అయినా మీడియా, సెలబ్రిటీల మధ్య పరస్పర గౌరవం ఉండాలి! అని కృతి పేర్కొంది. అసలు మీడియాలు మహిళలను ఎలా చూస్తాయో చెప్పాలని కూడా కృతి ఈ సందర్భంగా కోరారు. ఇది త్రోబ్యాక్ వీడియో అయినా జోరుగా వైరల్ అవుతోంది.మహిళల రక్షణ, గోప్యత, గౌరవం గురించి కృతి మాట్లాడిన విషయాలు అందరికీ నచ్చాయి. కృతి సనోన్ తో పాటు ఇటీవలి కాలంలో పలువురు యువనటీమణులు ఇండస్ట్రీలో సమస్యలపై బహిరంగంగా చర్చిస్తూ చర్చల్లోకొస్తున్నారు. కాక్ టైల్ 2, తేరే ఇష్క్ మే అనే రెండు భారీ చిత్రాల్లో కృతి సనోన్ నటిస్తోంది.



చిక్ క్యాజువల్ గ్లామ్‌లో నటాషా సింగ్ స్టన్స్



వైబ్రెంట్ ఆరెంజ్ డ్రెస్‌లో కంగనా శర్మ స్టన్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com